ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం 03 జూలై 2026 | Friday 03 July 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 90 | Vol.No 28 Issue No .90 | Hyderabad | www.visionandhra.in

# రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత

- కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్ల పర్వం
- తెలంగాణ భవన్ వద్ద హరీష్ తదితరుల అరెస్ట్
- గన్‌పార్క్ వద్ద చర్చకు సిద్ధం అంటూ మంత్రుల బైఠాయింపు





హైదరాబాద్,జూలై2 : రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో పాలిటిక్స్ హీటెక్కాయి. కాంగ్రెస్ పార్టీ రెండున్నరేండ్ల చెత్త పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో పక్కాగా వివరిస్తాననిస్పష్టం చేశారు. డేట్ అండ్ టైం ప్లేస్ ఏదైనా సరే.. 'వరంగల్ ప్రెస్‌క్లబ్‌లోనా? అశోకనగర్‌లోనా? అసెంబ్లీలోనా? వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరపున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? మిగతా 2లో..

## సిఎంతో గిరిజన ఎమ్మెల్యేల భేటీ



- సీతక్క నాయకత్వంలో పలు అంశాలపై చర్చ
- ఏజెన్సీలో అదనగంగా 2వేల ఇందిరమ్మ ఇళ్లకు వినతి

హైదరాబాద్,జులై 2 :సచివాలయం లో మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆదివాసి ,గిరిజన శాసన సభ్యులు కలిశారున. పలు అంశాలపైన సీఎం కి వినతి పత్రాలు అందించారు. ఏజెన్సీ ప్రాంతంలోని మిగతా 2లో..

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

- తుది దశలో స్థలాల సేకరణ
- దశలవారీగా ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా వెయ్యి ఇళ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి







హైదరాబాద్,జూలై2 : క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను గురువారం నాడు మంత్రి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానికఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులతో కలిసి మిగతా 2లో..

## ఇప్పట్లో పెట్రో ధరలను తగ్గించలేం

- ఇంకా నష్టాల్లోనే చమురు కంపెనీలు
- కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ



న్యూఢిల్లీ,జూలై2 : పెంచినే పెట్రో ధరలను ఇప్పట్లో తగ్గించే ఉద్దేశ్యం లేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇప్పటికీ పెద్ద మొత్తంలో నష్టాలు చవిచూస్తున్నా యని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ అన్నారు. జూన్ 30 వరకు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై రూ.74,781 కోట్ల మేర నష్టం చవిచూసినట్లు వెల్లడించారు. మిగతా 2లో..

## గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

- ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే చర్చిస్తాం
- కెసిఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు
- బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొన్నం ప్రతి విమర్శలు



హైదరాబాద్,జూలై2 : గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మిగతా 2లో..

## భట్టితో సిఎస్ మర్యాదపూర్వక భేటీ



హైదరాబాద్,జులై 2 : రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మధ్యాహ్నం తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు క్షేమసమాచారాలు చర్చించారు. సిఎస్‌గా నియమితులయినందుకు జాజును భట్టి అభినందించారు.

## బిఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్ధమే

- చేసిన అప్పలకు వడ్డీలు కట్టలేక పోతున్నాం
- ఇంత జరుగుతన్నా కెసిఆర్ ఎందుకు మాట్లాడరు
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్,జూలై2 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ప్రభుత్వం రూ.7.3 లక్షల మిగతా 2లో..

## బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కవిత

- అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు




మిగతా 2లో..

## సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్



హైదరాబాద్,జులై 2 : అసత్యాలతో ప్రజలను మబ్బే పెట్టే కార్యక్రమం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు విమర్శించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలకు సమాధానం ఇచ్చే తెగువ కాంగ్రెస్ సర్కార్‌కి లేదని ఎద్దేవా చేశారు. గతంలో మిగతా 2లో..

## గంజాయి స్మగ్లర్ల కొత్త ఎత్తులు

- స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లలో గంజాయి
- హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు
- వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



హైదరాబాద్,జూలై2 : దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్శిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. దీంతో ఇక పోస్టల్ పార్శిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు మిగతా 2లో..

## 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం



- పాలనలో విస్తృతంగా సాంకేతికత వినియోగం
- ఐటీ నుంచి ఏఐ వరకు ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం
- పేదలు, ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు పి4 కార్యక్రమం
- స్వర్ణాంధ్ర 2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్' లో చంద్రబాబు

తిరుపతి,జూలై2 : 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. 'స్వర్ణాంధ్ర 2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్' అనే అంశంపై జరుగుతున్న ఈ మిగతా 2లో..

## అగ్రరాజ్యంలో చీకటి కోణం

- రహస్యంగా 16మంది చిన్నారుల నిర్బంధం
- ఓ కేసు కోసం వెళ్లిన పోలీసులకు కనపడ్డ దృశ్యం



న్యూయార్క్,జూలై2 :అగ్రరాజ్యం అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. 16 మిగతా 2లో..

# ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ జీ పథకం

- రైల్వేకోడూరు నుంచి పథకం ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీజీ రామ్ జీ తో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు
- ప్రతీ గ్రామ పంచాయితీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- వీబీ జీ రామ్ జీ పోర్టల్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- వీబీ జీ రామ్ జీ పథకం భారం కాదు బాధ్యతన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి హామీ
- పీఎం ఆవాస్ యోజన, పీఎం గ్రామీణ్ సడక్ యోజన కింద రూ.422 కోట్ల నిధుల పత్రం అందజేత



తిరుపతి, జూలై 02 : కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం వీబీ జీ రామ్ జీ ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఘట్టానికి తిరుపతి జిల్లా రైల్వేకోడూరు వేదికైంది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' పథకాన్ని ఏపీ నుంచి మిగతా 2లో..

## 12 రోజుల ఉత్కంఠకు తెర.. కిడ్నాప్‌కు గురైన చిన్నారి నిఖిల్ క్షేమంగా లభ్యం

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అపహరణ ఘటనకు సుఖాంతం
- సీసీటీవీ ఆధారాలతో నిందితుడి జాడ కనిపెట్టిన పోలీసులు
- జీడిమెట్ల పోలీసుల అప్రమత్తతతో చిన్నారి సురక్షితంగా రక్షణ
- వీడియో కాల్‌లో కుమారుడిని గుర్తించి భావోద్వేగానికి గురైన తల్లిదండ్రులు
- నిందితుడిని రైల్వే పోలీసులకు అప్పగించి తదుపరి విచారణ
- పోలీసుల సమన్వయం, చాకచక్యానికి ప్రశంసల వెల్లువ




జీడిమెట్ల, జులై 2 (విజన్ ఆంధ్ర): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గత నెల 20న కిడ్నాప్‌కు గురైన మూడేళ్ల చిన్నారి నిఖిల్ రాజు సురక్షితంగా లభ్యమవడంతో 12 రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, జీడిమెట్ల పోలీసులు సమన్వయంతో చేపట్టిన దర్యాప్తు ఫలించి చిన్నారిని క్షేమంగా రక్షించి, తల్లిదండ్రులకు అప్పగించారు. గత నెల 20న నిఖిల్ తన అమ్మమ్మతో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు ఆలస్యమవడంతో ప్లాట్‌ఫారంపై అమ్మమ్మ ఒడిలో నిద్రిస్తున్న మిగతా 2లో..

## గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా..? రూ.5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం. మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆర్ఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## బిఆర్ఎస్ చేసిన అప్పులపై చర్చకు సిద్ధమే

కోట్ల అప్పులు చేసిందన్నారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.74వేల కోట్ల అప్పు చేసిందన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా. తాము అప్పులు చేయలేదని కేసీఆర్ చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమైతే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నా. కార్పొరేషన్ పేరుతో అప్పు చేసి కాళేశ్వరం కట్టామని చెబుతున్నారు. అది నిజమా కాదా చెప్పాలన్నారు. ఇలా అప్పులు చేసి, ఎలా తీరుస్తారో ఎందుకు చెప్పలేదన్నారు. ఆ అప్పులను రైతుల నుంచి వసూలు చేస్తారా? ఒక్కో రైతు నుంచి రూ.20 లక్షలు వసూలు చేస్తారా?మేం చేసిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. నా వద్ద ఉన్న రికార్డులు, కాగితాలు ఇస్తా.. చర్చకు రావాలి. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంకా బుకాయిస్తున్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కేసీఆర్ స్వయంగా మీడియాకు చెప్పాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నామని జూపల్లి అన్నారు. మరోవైపు అప్పులపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌కు వస్తానన్న మంత్రి జూపల్లి ఎందుకు రాలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆయన కోసం కేటీఆర్ వేచి చూస్తున్నారని అన్నారు. చర్చకు సవాల్ విసిరిన మంత్రులు తోక ముడిచి పారిపోయారని విమర్శించారు.

## సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సవాల్ చేశారని.. ప్రెస్‌క్లబ్‌కి వెళ్తే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుల విషయంలో దమ్ముంటే రావాలని సీఎం సవాల్ చేశారని తెలిపారు. పలు విషయాలపై చర్చించడానికి తాము సిద్ధమని రేవంత్‌రెడ్డికి చెప్పామని.. ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. సవాల్ విసిరిన ముఖ్యమంత్రి పారిపోయారని సెటైర్లు గుప్పించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో సవాల్ విసిరారని.. సీఎం పంపితే జూపల్లి వస్తున్నారని తాము అనుకున్నామని.. కానీ పనికి మాలిన డైలాగ్‌లను జూపల్లి కొడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. సవాల్ విసిరి మంత్రులు పారిపోతున్నారంటేనే.. ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో తెలిసిందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు బయల్దేరగానే ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయించిందని ప్రశ్నించారు. గన్‌పార్కు రమ్మన్నారని.. వెళ్తుంటే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. చేతకాని వాళ్లు ఎందుకు సవాల్ విసరాలని నిలదీశారు. అసెంబ్లీలో తనకు గంట సమయం ఇవ్వాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

## గంజాయి స్మగ్లర్ల కొత్త ఎత్తులు

తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తొన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు, గుడిమల్కపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్సిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుస్రో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని జఖఎ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 –100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్సిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్సిల్‌లో 50 – 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరాదారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు.

## సిఎంతో గిరిజన ఎమ్మెల్యేల భేటీ

నియోజకవర్గాల్లో అదనం గా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిర గిరి జల వికాసం పథకం అమలు చేయాలని అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అలాగే ఐటీడీఏ లను మరింత బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అశ్వారావుపేట ఎంఎల్ ఏ జారే ఆదినారాయణ,పినపాక ఎంఎల్ ఏ


తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ-ధర్మాదాయ శాఖ
శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం
యం.జి.రోడ్, కొత్తగూడెం పట్టణం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,

Rc.No.SSVSD/09/2024 సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం ప్రకటన Dt.27-06-2026.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణం, M.G.రోడ్ నందు కల శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానమునకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ లోని షాపు నెం. 15 లీజు హక్కు మరియు కొబ్బరి చిప్పలు ప్రోగుచేసుకునే హక్కు పొందుటకు తేది: 08-07-2026 మంగళవారం రోజున మ. 2.00 గంటల నుండి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించబడును. ఆసక్తి కలవారు ధరవత్తు రూ. 30,000/-. హిందువులు మాత్రమే పాల్గొనవలెను. పూర్తి వివరములకు దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించగలరు.

**కొటేషన్స్**

దేవస్థానము నందు జరుపబడు వినాయక నవరాత్రులు, శ్రీ దేవి నవరాత్రులను పురస్కరించుకుని 1) రంగులు వేయుట, 2) సున్నాలు వేయుట, 3) రంగులు-సున్నాలు సప్లై చేయుట, 4) లైటింగ్, 5) సౌండ్ సిస్టమ్, 6) దేవాలయాల పూల అలంకరణ 7) పూలదండలు సప్లై, '8) ఋత్విక్కులు, 9) వస్త్రములు, 10) ఋత్విక్కులకు వంట ప్రసాదములు తయారీ చేయుట, 11) అలంకరణలు వేయుట గాను కొటేషన్స్ కోరబడుచున్నవి. పూర్తి చేసిన కొటేషన్స్‌ను తేదీ.07.07.26 సాయంత్రం 5 గంటలకు దేవస్థాన కార్యాలయములో అందించవలయును. కొటేషన్స్ కొరకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/-
కార్యనిర్వహణాధికారి

DIPR RO NO.5318-PP/CL/ADVT/2026-27 తేదీ 02-07-2026


## 12 రోజుల ఉత్కంఠకు తెర.. కిడ్నాప్‌కు గురైన చిన్నారి నిఖిల్ క్షేమంగా లభ్యం

చిన్నారిని అదనుగా భావించిన ఓ గుర్తుతెలియని వ్యక్తి అపహరించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం మేల్కొన్న కుటుంబ సభ్యులు చిన్నారి కనిపించకపోవడంతో వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్టేషన్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితుడి ముఖచిత్రం స్పష్టంగా లభించినప్పటికీ, అతడు గుర్తింపు పత్రాలు లేకుండా ఓయో గదుల్లో బస చేస్తూ తరచూ ప్రాంతాలు మారుతుండటంతో అతని ఆచూకీ కనుగొనడం పోలీసులకు సవాల్‌గా మారింది. అయినప్పటికీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరంగా గాలింపు చర్యలు కొనసాగించారు. ఈ క్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌కు షేక్ మహబూబ్ అలీ అనే వ్యక్తి చిన్నారితో కలిసి రావడం పోలీసుల దృష్టికి వచ్చింది. అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా, తొలుత రెండు

రోజుల క్రితం బాలుడు తనకు దొరికాడని చెప్పాడు. అయితే లోతుగా విచారణ చేపట్టడంతో గత నెల 20న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి చిన్నారిని తానే తీసుకెళ్లినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చిన్నారి ఫొటోలను సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు పంపించగా, కిడ్నాప్‌కు గురైన నిఖిల్ రాజేనని నిర్ధారణ అయింది. అనంతరం వీడియో కాల్ ద్వారా చిన్నారిని తల్లిదండ్రులకు చూపించగా, తమ కుమారుడేనని వారు ధృవీకరించారు. దీంతో చిన్నారిని అధికారికంగా తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు షేక్ మహబూబ్ అలీని జీడిమెట్ల పోలీసులు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు అప్పగించారు. అతడిపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు రైల్వే పోలీసులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసును ఛేదించడంలో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, జీడిమెట్ల పోలీసుల సమన్వయం, అప్రమత్తత, సాంకేతిక ఆధారాల వినియోగం కీలక పాత్ర పోషించాయని అధికారులు వెల్లడించారు. చిన్నారి సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేరుకోవడంతో తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు బృందంపై స్థానిక ప్రజలు ప్రశంసల వర్షం కురిపించారు.

## అగ్రరాజ్యంలో చీకటి కోణం

మంది చిన్నారులను ఏళ్ల తరబడి ఓ పాడుబడిన ఇంట్లో బంధించి ఉంచిన విషయం తాజాగా బయటపడింది. మరో కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసులు ఆ ఇంటికి వెళ్లగా అక్కడ కనిపించిన దృశ్యాలు వారిని దిగ్భ్రాం÷–రతికి గురి చేశాయి. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను వెంటనే రక్షించిన పోలీసులు, వారిని బంధించిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒహాయో రాష్ట్రంలోని హామ్డెన్‌లో రైల్వే ట్రాక్ పక్కన దట్టమైన చెట్లు, పొదల మధ్య ఉన్న ఓ ఇంటికి పోలీసులు సెర్చ్ వారెంట్‌తో వెళ్లారు. అక్కడ 16 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు బంధించి ఉంచినట్లు గుర్తించారు. గత నాలుగేళ్లుగా వారు అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులను 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒకే గదిలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిన్నారుల వయస్సు 18 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండగా, వారిలో బాలురు, బాలికలు ఉన్నారు. అంతేకాక, ఆ ఇంట్లో ఇంతమంది చిన్నారులు ఉన్న విషయం

చుట్టుపక్కల వారికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చిన్నారులకు బయటి ప్రపంచంతో దాదాపు ఎలాంటి సంబంధం లేకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వారిలో ఎవరినీ ఇప్పటివరకు తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చాలా కాలం పాటు బంధించబడటంతో వారు సాధారణంగా మాట్లాడటానికే ఇబ్బంది పడుతున్నట్లు ఒహాయో అటార్నీ జనరల్ తెలిపారు. దాదాపు అందరూ అడవి మనుషుల్లా కనిపించారని ఆయన పేర్కొన్నారు. ఈ 16 మంది చిన్నారులూ ఒకే కుటుంబానికి చెందినవారని అధికారులు వెల్లడించారు. రక్షించిన వెంటనే ఏడుగురు చిన్నారులను చికిత్స కోసం కొలంబస్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో అత్యవసర చికిత్స కోసం తరలించాల్సి వచ్చింది. ఘటనలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలైన గ్యారీ సైడర్స్ జూనియర్, గ్యారీ సైడర్స్ సీనియర్, క్రిస్టినా సైడర్స్, ఎలిజబెత్ సైడర్స్‌లపై సెకండ్–డిగ్రీ ఫెలనీ 'చైల్డ్ ఎండేంజర్‌మెంట్' అభియోగాలు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ప్రతి నిందితుడికి 3 లక్షల డాలర్ల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయాలని కోర్టు నిర్ణయించింది.

## 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్, కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్, నీతి ఆయోగ్ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఆర్థికాభివృద్ధి, పాలన, డేటా ఆధారిత నిర్ణయాలు వంటి అంశాలపై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను విజయవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులను సన్నద్ధం చేయడం ఈ వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యం. ప్రణాళికల రూపకల్పన నుంచి వాటి అమలు వరకు అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు అవగాహన కల్పించనున్నారు. భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో డేటా, సాంకేతికత పాత్రపై ప్రత్యేక చర్చలు నిర్వహిస్తున్నారు. ప్యానల్ చర్చల్లో పాల్గొన్న నిపుణులు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పలు కార్యక్రమాలను అభినందిం చారు. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా రూపొందిస్తున్న విజన్ ప్లాన్, పి4 కార్యక్రమం, గ్రామ స్థాయి డేటా సేకరణ, పాలనలో కృత్రిమ మేధ వినియోగం వంటి అంశాలను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కనిపించడం లేదని, వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సాంకేతికతను పాలనలో విస్తృతంగా వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఐటీ నుంచి ఏఐ వరకు ప్రతి ఆధునిక సాంకేతికతను రాష్ట్ర

అభివృద్ధికి ఉపయోగిస్తు న్నామని చెప్పారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రాన్ని తీసుకురావడానికి తాము అమెరికా వరకు వెళ్లి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆధార్‌ను దేశంలో ఒక గేమ్ చేంజర్‌గా అభివర్ణిస్తూ, ప్రతి ప్రభుత్వ పథకాన్ని ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల డూప్లికేషన్‌లను నివారించడం సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ప్రపంచం డేటా ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు వేగంగా అడుగులు వేస్తోందని చంద్రబాబు అన్నారు. 'డేటానే సంపదగా మారిన ఈ యుగంలో డేటా ఆధారిత నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయి' అని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టికి ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్‌లో పెట్టుబడుల ప్రాధాన్యాన్ని ప్రత్యేకంగా చేర్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని శాఖల డేటాను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తున్నామని సీఎం అన్నారు. అలాగే ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసి 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. పేదలు, ధనికుల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు పి4 కార్యక్రమాన్ని రూపొందించామని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ప్రోత్సహించడం, సమగ్ర అభివృద్ధిని సాధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా విజన్ 2020ను రూపొందించినప్పుడు అనేక విమర్శలు ఎదుర్కొన్నామని చంద్రబాబు గుర్తు చేశారు.

## ఇప్పట్లో పెట్రో ధరలను తగ్గించలేం

అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినప్పటికీ.. పాత క్రూడాయిల్‌నే ఇప్పటికీ ప్రాసెస్ చేస్తుండడం ఇందుకు కారణమన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పెట్రో ఉత్పత్తులను ప్రాసెస్ చేయడానికి రెండు నెలల ముందే ముడి చమురును ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. రెండు నెలల ముందు నుంచి ఈ పక్రియ మొదలవుతుంది. అంటే ఇప్పుడు

ప్రాసెస్ చేస్తున్న ముడి చమురు ఏప్రిల్ లేదా మే నెలలో కొన్నది. అప్పట్లో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు చాలా అధికంగా ఉన్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరాక ముడిచమురు ధరలు దిగొచ్చాయని హర్దీప్ సింగ్ పురి వివరించారు. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఎప్పుడు తగ్గిస్తారు? అని విలేకరులు ప్రశ్నించగా.. రాబోయే కొన్ని వారాల పాటు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు అది సమంజసమైన ప్రశ్న అవుతుందంటూ పురీ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత

ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనా వైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని చాలెంజ్ చేశారు. కాగా, కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు గురువారం 11 గంటలకు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతా మన్నారు.

సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఇదిలావుంటే గురుకులాల్లో టెండర్లలో అవినీతి ఆరోపణలపై చర్చల్లో ట్విస్టు చోటు చేసుకుంది. కేటీఆర్, హరీశ్ రావు గన్‌పార్క్‌కు రావాలని మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో గురుకులాల్లో అవినీతిపై చర్చకు హరీశ్ రావు సిద్ధమయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్‌పార్క్ బయలు దేరారు. గురుకులాలపై చర్చకు మేము ప్రెస్‌క్లబ్ రమ్మంటే మంత్రులు గన్‌పార్క్ రమ్మన్నారు. మాకు ఎలాంటి భేషజాలు లేవు. మీరు రమ్మన్నారు మేము వస్తున్నామని తెలిపారు. చర్చకు ఎక్కడికైనా మేము సిద్ధమని పేర్కొన్నారు. ఎలాంటి గొడవలు వద్దు కూర్చొని మాట్లాడుకుందామన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. ఒకవేళ మంత్రి జూపల్లి తెలంగాణ భవన్‌కు వెళ్తే..కేటీఆర్ చర్చించేందుకు రెడీగా ఉన్నారని పేర్కొన్నారు.కాగా, గన్‌పార్క్‌కు బయలు దేరిన హరీశ్ రావును పోలీసులు అడ్డుకోవడంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముగ్గురు మంత్రులు రమ్మంటేనే మేము వెళ్తున్నాం. ఎందుకు ఆపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. కావాలంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చర్చలను అడ్డుకుంటుందని హరీశ్ రావు మండిపడ్డారు.మాజీ మంత్రి హరీశ్

రావు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కారు దిగి పాదయాత్రగా వెళ్లేందుకు హరీశ్ రావు యత్నించారు. ఈ క్రమంలో అక్కడ జరిగిన తోపులాటలో ఆయన కిందపడిపోయారు. ఆ వెంటనే మాజీ మంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరీశ్‌తో పాటు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు. దీంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం పారిపోయిందంటూ దుయ్యబట్టారు. అవినీతి జరిగింది కాబట్టే భయపడుతున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గన్‌పార్క్‌కు ముగ్గురు మంత్రులూ చేరుకుని.. అమరవీరుల స్థూపం దగ్గర కూర్చున్నారు. మంత్రులకు మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గన్‌పార్క్‌కు వచ్చారు. తెలంగాణ మంత్రులు, మాజీ మంత్రుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో గన్‌పార్క్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. అటు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్ దగ్గర కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ జీ పథకం

ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని ముగ్గురు నేతలూ లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. ఈ పథకం కింద స్థానిక లబ్దిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు కలిసి వీబీజీ రామ్ జీ జాబ్ కార్డులను అందజేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ లు వీబీ జీ రామ్ జీ ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ పథకం కింద సమాచార బుక్ లెట్, కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విడుదల చేశారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజీవికా మిషన్ పోర్టల్ ను నేతలు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.." వీబీ జి రామ్ జీ పథకం ఏపీలోని రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా వీబీజీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం మరో రూ.4 వేల కోట్ల వ్యయంతో వీబీజీ రామ్ జీ కింద పనులు చేపడతాం. రూ.11 వేల కోట్ల పైచిలుకు మొత్తంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ఈ పథకం కింద గ్రామాల రూపు రేఖలు మారతాయి. 125 రోజుల పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు వీబీజీ రామ్ జీ కింద అవకాశం కల్పిస్తోంది. రహదారులు, డ్రైనేజీలు, కాలువలు ఇలా వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం వినియోగిస్తాం. జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తాం. గాలేరు నగరి నుంచి కోడూరుకు నీళ్లు తీసుకువస్తాం, జలధార ద్వారా భూగర్భ జలాలను కూడా పెంచుతాం. రాష్ట్రాలు వ్యయం చేసేలా ఈ పథకం చేపట్టటం భారం కాదు బాధ్యత. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కే దక్కింది. 7,000 కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు,

1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కి.మీ మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి, రూ.16,695 కోట్లు ఖర్చు చేశాం. ఈ ఏడాది 10 వేల కి.మీ. గ్రావెల్ రోడ్లు, 1,500 కి.మీ. సిమెంట్, బీటీ రోడ్లు, 500 కి.మీ. మేజిక్ డ్రైన్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా పొలాలకు వెళ్లే డొంక రోడ్లు కూడా జీ రామ్ జీ పథకం కింద నిర్మించవచ్చు". అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే వాటిని తిరిగి పునరుద్ధరించామని సీఎం అన్నారు. రూ.28 వేల కోట్లతో వివిధ పథకాలు చేపడుతున్నామని.. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలో మాట నిలుపుకున్నామని వివరించారు. సీఎం మాట్లాడుతూ "కేంద్రం అమరావతికి సహకారం అందించింది. వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికలు అయ్యాక మరో మాట మాట్లాడారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారు. ఇది ఎవరికైనా అర్థం అయ్యిందా. అమరావతిని ఆపటం ఎవరి తరమూ కాదు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించాం. గూగుల్ డేటా సెంటర్ తో పాటు పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వస్తోంది. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతాం. దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రం రాయలసీమ. త్వరలోనే రూ.40 వేల కోట్లతో ప్రభుత్వం, రూ.60 వేల కోట్ల ప్రైవేటు ప్రైవేటు పెట్టుబడులు తెస్తాం. మదనపల్లిలో హార్టీకల్చర్ హబ్ కు త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. సత్యవేడులో హీరో మోటార్స్ సైకిళ్ల తయారీ యూనిట్ ఉంది. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమస్యల్ని పరిష్కరించారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు, రహదారులు, పీఎంఏవై కోసం నిధులు ఇచ్చారు. దీనికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా ఏపీని తయారు

చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణ గిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను. భారత మాతకు వికసిత్ భారత్ – తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర సంకల్పం చేశాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ అన్ స్టాపబుల్. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రతి పేద కుటుంబానికి ఇల్లు' అనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో చోట కనీసం 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 5500 వరకు ఇళ్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ, పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎకరాకు రూ.100 నుంచి రూ.200 కోట్ల వరకు ఉన్నా కూడా ఆ భూముల విలువను పక్కనబెట్టి పేదలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు ఇస్తామని మంత్రి తెలిపారు. ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ కాలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందిస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేలా పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించేందుకు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలను నగరాల నుంచి 30 కిలోమీటర్ల దూరంలోకి తరలించి ఇళ్లు కట్టే విధానం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండదని, వారి జీవనాధారాలకు దగ్గరగా, అదే నియోజకవర్గ పరిధిలోనే ఇళ్లు అందించడం ప్రభుత్వ కట్టుబాటు అని మంత్రి స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే కేవలం రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని, అది సాధ్యం కాకపోతే తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయనని విసిరిన సవాల్‌కు ఇప్పటివరకు బీఆర్ఎస్ నేతల నుంచి స్పందన రాలేదని గుర్తుచేశారు. పేదల ఇళ్ల నిర్మాణంలో ప్రయోజనం లేదనే ఆలోచనతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ మాత్రం అదే నిధులను పేదల గూడు కోసం వినియోగిస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కవిత

హైదరాబాద్,జూలై2 : తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితను బోడుప్పల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బోడుప్పల్‌లో భూ పోరాటానికి టీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా బోడుప్పల్ చేరుకుని భూ పోరాటం చేస్తున్న కవితను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో టీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తోపులాట చోటు చేసుకోవడంతో కవితతో పాటు టీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందిందని కవిత అన్నారు. బొల్లారం పీఎస్ వద్ద టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. మహిళలు, తెలంగాణ ఉద్యమకారులపై పోలీసులు విచక్షణార హితంగా లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే అడిగాం తప్ప వేరే డిమాండ్లు ఏమీ అడగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యిందన్నారు. ఉద్యమకారులకు వాళ్లు ఇస్తామన్న 250 గజాల స్థలం ఇవ్వాలని మాత్రమే అడిగామని తెలిపారు. కచ్చితంగా ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అడిగితే ఉద్యమకారులపై లాఠీఛార్జ్ చేసి రక్తం చిందేలా కొట్టడం అన్యాయమన్నారు. ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలను ఈ ప్రభుత్వానికి రోజూ గుర్తు చేస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు.

## ఏపీకి నేను మేనమామ - కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

సీఎం చంద్రబాబుతో కలిసి వీబీ జీ రామ్ జీ పథకం ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకే వీబీజీ రామ్ జీ కింద రూ.7.5 లక్షల కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఏపీకి కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని అన్నారు. స్వయంగా గ్రామ సభలే పంచాయితీలో పనుల్ని నిర్దేశించుకుంటాయని తెలిపారు. తనను మధ్యప్రదేశ్ లో అంతా మామాజీ అని పిలుస్తారని.. ఇప్పుడు ఏపీకి కూడా తాను మేనమామనే అయ్యానని మంత్రి వ్యాఖ్యానించారు. ఏ మేనమామ ఖాళీ చేతులతో రాడని.. ఏపీకి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

దీనికి సంబంధించిన పత్రాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలకు ఆయన అందజేశారు. అలాగే 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేస్తుందని ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన పత్రాలను కూడా సీఎం చంద్రబాబుకు ఆయన అందజేశారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎక్కడా చేయి విడిచి పెట్టేది లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ తమ పుట్టిన రోజున కనీసం ఒక మొక్క నాటేలా సంకల్పం తీసుకోవాలని మంత్రి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్, మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే అరవశ్రీధర్ సహా ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సంపాదకీయం

## తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు !

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్ల ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఏపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొద్దలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఏపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాలు విసురుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు. కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్తో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్దమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఓక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు

పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడు తోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూలై 02 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ పట్టణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో " 2026 కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఇంజినీరింగ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, సీఎన్‌సీ మెషిన్ మెకానిక్, వర్చువల్ అనాలిసిస్ విభాగాలతో పాటు ఎలక్ట్రిషియన్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రఫీ తదితర ట్రేడ్లకు చెందిన ప్రాజెక్టులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకొని వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు వెన్నెముక వంటివని, ఆ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడంలో ఐటీఐ కోర్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు త్రీడీ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత టెక్నాలజీలు వంటి ఆధునిక అంశాల్లో నైపుణ్యం పెంపొందించుకొని దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.



విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి ప్రాజెక్టు వినూత్న ఆలోచనలతో, సాంకేతిక నైపుణ్యంతో రూపొందించబడిందని ప్రశంసిస్తూ, ఇలాంటి ప్రాజెక్టులు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, మావల సీఐ బి.డి. ప్రేమ్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలి

### –జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా,జూలై 02,(విజన్ ఆంధ్ర); రేపటి దిశ కమిటీ సమావేశానికి సంబంధించి అన్ని నివేదికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం కలెక్టర్ దిశ కమిటీ సమావేశ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత ప్రజాప్రతినిధులందరికీ దిశ కమిటీ సమావేశానికి సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రతి అధికారి వారి శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధి వివరాల నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. నివేదికలు పారదర్శకంగా ఉండాలన్నారు.




ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, పథకాల వివరాలను సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి భూమి పూజ

### రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

### జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్

కౌడిపల్లి, జూలై 02 (విజన్ ఆంధ్ర):రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతున్నట్లు జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్ పేర్కొన్నారు. గురువారం నాడు మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఫుడ్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి భూమి పూజ చేయడం కోసం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కౌడిపల్లి గ్రామానికి ఇందిరా క్రాంతి పథకం ద్వారా 600 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగి ప్రభుత్వం మంజూరి చేయడం హర్షించే తగ్గ విషయమని ఆయన అన్నారు. మహిళా సంఘాలు పండించిన ఆహార ధాన్యాలు ఈ గిడ్డంగులో నిలువ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలోని మల్లన్న ఆలయం వెనకాల గల ప్రభుత్వ



స్థలంలో కౌడిపల్లి డివిజన్ పంచాయతీరాజ్ శాఖ డీఈ ఈ అమరేందర్ తో కలిసి ఆహార ధాన్యం నిలువ గిడ్డంగి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు రాజిరెడ్డి, సందీప్ కుమార్, మక్బుల్, దేవేందర్, రమేష్ నాయక్, లక్ష్మీశరత్, ఎఫ్పిసి చైర్ పర్సన్ నాగజ్యోతి, వైస్ చైర్మన్ సుకన్య, డైరెక్టర్ రాజేశ్వరి, గ్రామ సంఘం అధ్యక్షురాలు పూర్ణిమ, వివోఏ, ఏసు, లాల్య, నాయకులు రాగుల భూమయ్య పటేల్, వెంకటేష్ గుప్తా, కుర్మ లక్ష్మణ్, పుండరీకం గౌడ్, సత్యనారాయణ గౌడ్, మంగలి అశోక్ నాయి, రమేష్ గౌడ్, తిరుమలేష్, వీరేశం గౌడ్, కౌడిపల్లి యాదవ సంఘం నాయకులు గోపాల్ యాదవ్, పిఆర్ ఏఈ మారుతి, గ్రామ మండల సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా ‘సీఎంఆర్ఎఫ్‘ : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి, జూలై 2,(విజన్ ఆంధ్ర) : అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద లకు ‘సీఎంఆర్ఎఫ్‘ ఆర్థిక భరోసానిస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే,తన క్యాంపు కార్యాలయంలోవినాయక్ నగర్‌కు చెందిన గజ్వేల్ స్వరూపర్ కి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 2,00,000/- విలువైన ఎల్ ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పథకం వైద్య చికిత్స కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగ పడుతుం దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్ర మౌళి,తులసి సురేష్, ఫరీద్, సాయి సాగర్, చారి , ఉపేంద్ర, రాజు ,సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## అభ్యసన నైపుణ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, జూలై 02 (విజన్ ఆంధ్ర): విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో ఫిజిక్స్ లెక్చరర్ల కు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం సిలబస్ పూర్తి చేయడం మాత్రమే కాకుండా, విద్యార్థులకు సబ్జెక్టులపై స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతులలో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డి.ఐ.ఈ.ఓ ల దృష్టికి తీసుకువెళ్లి నివారించాలన్నారు. సైన్స్ సబ్జెక్టులలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలని, తరగతిలో వెనుకబడిన లేదా ‘టీచర్ సపోర్టెడ్‘ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తొలుత సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ, కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల



భవిష్యత్తుకు ఎంతో కీలకమైనందున, ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా నెలవారీ సమీక్షలు, ఈ విద్యాసంవత్సరంలో 3 లేదా 4 కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, జిల్లా అకడమిక్ కమిటీ సభ్యులు సూరజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమాకాంత్, తిరుపతి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఇతర జూనియర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరం

### ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

### 43 మందికి 12,86,000 రూపాయల చెక్కుల పంపిణీ చేసిన పోచారం.

బాన్సువాడ జులై 2 (విజన్ ఆంధ్ర ). ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరం అని గురువారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బాన్సువాడ పట్టణ కేంద్రం లోని తన నివాసం వద్ద బాన్సువాడ నియోజక వర్గంలోని 43 మంది ముఖ్యమంత్రి సహాయ నిది లబ్ధిదారుల కు రూ 12,86,000, ల చెక్కులను పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి. మండలాల వారిగా సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల వివరాలు. బాన్సువాడ గ్రామీణ మండలం 6 గురు సీఎం ఆర్ ఎఫ్ లబ్ధిదారులకు రూ 2,03,000, బాన్సువాడ మున్సిపాలిటీ ఇద్దరు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ 34,000, బీర్కూర్ మండలం ముగ్గురు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ 1,12,000, నసురుల్లబాద్



మండలం 05 గురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు రూ 1,31,000, మోస్రా మండలం ముగ్గురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు 60,500, చందూర్ మండలం 05 గురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు రూ 1,25,500, వర్ని మండలం 4 గురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ 1,81,000, రుద్రుర్ మండలం 9 మంది సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు రూ 2,39,500, కోటగిరి మండలం నలుగురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు రూ 1,34,000, పోతంగల్ మండలం ఇద్దరు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారుల కు రూ 65,500, మొత్తం నియోజక వర్గం లో 43 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల కు రూ. 12,86,000, ఈ కార్యక్రమంలో నియోజవర్గం లో ని ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వర్షం కురవాలని గ్రామదేవతలకు పూజలు



ముధోల్, జూలై 2 ‘విజన్ ఆంధ్ర ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉరాడవ్వ మందిరం నుంచి మహిళలు, గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు శోభాయాత్రగా బయలుదేరారు. అనంతరం మా లక్ష్మి అవ్వ, ముత్యాలమ్మ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నది తీరానికి వెళ్లి డప్పుల సప్పులతో పవిత్ర జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య శ్రీనివాస్, రాజారెడ్డి, అజయ్ రెడ్డి, భూమేష్, కనకాపురం ముత్యం, వీడీసీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. మా పూర్వీకుల సంప్రదాయం ప్రకారం ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించి గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రతి ఏడాది ఊర పండుగ జరుపుతున్నట్లు వారు తెలిపారు.

## నేడే సౌత్ ఇండియా షాపింగ్ మాల్ లో 15వ బ్లాక్‌బస్టర్ ఆషాఢం నంబర్ 1 కిలో సేల్ శుభారంభం

హైదరాబాద్ జూలై 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో విస్తరించిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 15వ బ్లాక్‌బస్టర్ ఆషాఢం నంబర్ 1 కిలో సేల్ ను నేడే శుభారంభం చేసింది. ఆసక్తిగా ఎదురుచూస్తున్న షాపింగ్ ఫెస్టివల్ , జూలై 3 నుంచి అమ్మకాలు ఆరంభించింది .ఈ సేల్ 15వ సంవత్సరంలోకి విశేషంగా ప్రవేశించడం సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం సంతోషపూర్వకంగా తమ కస్టమర్లకు స్వాగతం పలుకుతూ ధన్యవాదాలను తెలియజేసింది. ఈ మేరకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అందరినీ అక్కర్సించే గొప్ప డిజైన్లతో, సరసమైన తగ్గింపుతో కూడిన ధరలతో ముందుకు వచ్చింది. తాజా స్టాక్‌పై శాతం 66 వరకు తగ్గింపు తో అన్నిరకాల గార్మెంట్స్‌ను అందుబాటులో ఉంచింది. ఈ ఆషాఢం షాపింగ్ కిలోల్లో సంతోషం టన్నుల్లో”నినాదంతో సరికొత్త షాపింగ్ అనుభూతిని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తమ ఆత్మీయ కొనుగోలుదారుల కోసం సిద్ధం చేసిందని తెలిపారు. మూడు రాష్ట్రాలలోని తమ షోరూములలో లక్షలాది డిజైన్లను, వేల సంఖ్యలో ప్రీమియం క్లాతింగ్ వెరైటీలను సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అందుబాటులో ఉంచింది. మహిళలకు పురుషుల కోసం అలాగే, పిల్లల కోసం కళ్ళు మిరుమిట్లు గొలిపే వెరైటీల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సాటిలేని వెరైటీలతో, తగ్గింపు ధరలతో కూడిన తాజా స్టాక్ సిద్ధం చేశామని తెలిపారు. ఈ మహత్తర అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి, అంటూ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నిర్వాహకులు స్వాగతం పలుకుతున్నారు.



## అమృతలో ఐసీఆర్ఎమ్-26కు పరిశోధనా పత్రాల స్వీకరణ ప్రారంభం

హైదరాబాద్, జూలై 02 (విజన్ ఆంధ్ర) : అమృత విశ్వ విద్యాపీఠం ఆధ్వర్యంలో డిసెంబర్ 17-19, 2026 తేదీల్లో అమృతపురి క్యాంపస్‌లో జరగనున్న ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రోబోటిక్స్, మేట్రానిక్స్(ఐఆర్సీఎమ్-26) కోసం పరిశోధనా పత్రాల స్వీకరణ ప్రారంభమైనట్లు హ్యూమానిటేరియన్ టెక్నాలజీ(హెచ్యూటీ) ల్యాబ్స్ డైరెక్టర్, ఐఈఈఈ-26 ఆర్గనైజింగ్ ఛైర్ డా.రాజేష్ కన్నన్ మేగలింగం గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పత్రాల సమర్పణకు జూలై 15, 2026 చివరి తేదీ అని తెలిపారు. ఐఈఈఈ కేరళ సెక్షన్, ఐఈఈఈ రోబోటిక్స్, ఆటోమేషన్ సొసైటీ సహకారంతో హైబ్రిడ్ విధానంలో నిర్వహించే ఈ సదస్సులో ఎంపికైన పత్రాలను ఐఈఈఈ ఎక్స్‌ప్లోర్ లో ప్రచురించి స్కోపస్ లో ఇండెక్స్ చేయనున్నట్లు తెలిపారు. రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ఏఐ, ఆటోమేషన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ప్రధానాంశాలుగా ఉంటాయని తెలిపారు. యువ పరిశోధకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో ప్రధాన ప్రసంగాలు, వర్క్‌షాప్‌లు, రోబోటిక్స్ పోటీలు, రోబో ఎక్స్‌పో, ఈవీ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు చెప్పారు.

# నేటి యువతే రేపటి భారత భవిత..

### బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి
### మేడిపల్లి ఇన్స్పెక్టర్ జలేందర్ రెడ్డి
### ఒమేగా డిగ్రీ కళాశాలలో మేడిపల్లి పోలీసుల అవగాహన సదస్సు




బోడుప్పల్,జూలై 01(విజన్ ఆంధ్ర) : యువత దేశానికి వెన్నెముక అని, నేటి విద్యార్థులే రేపటి భారత భవిష్యత్తును నిర్మించే శక్తి అని మేడిపల్లి ఇన్స్పెక్టర్ జలేందర్ రెడ్డి అన్నారు.యువతను నేరాల బారిన పడకుండా చైతన్యవంతులను చేయడం, మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, సైబర్ నేరాలపై అప్రమత్తత కల్పించడం వంటి లక్ష్యాలతో మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఒమేగా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూప్రస్తుత సమాజంలో మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, ఆన్‌లైన్ మోసాలు వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి బెదిరింపులు, వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని భరోసా కల్పించారు.యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల ముఠాలు విస్తరిస్తున్నాయని, ఒక్కసారి డ్రగ్స్‌కు బానిసైతే విద్య, కుటుంబం, ఆరోగ్యం, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా అధికమవుతున్నాయని పేర్కొంటూ, గుర్తు తెలియని ఫోన్ కాల్స్, ఫేక్ లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, క్యూఆర్ కోడ్‌లు, సోషల్ మీడియా మోసాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేయాలని వివరించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత కీలకమని పేర్కొన్న ఎస్‌హెచ్‌ఓ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర అలవాట్లు ప్రాణాంతకమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెకర్లు కృష్ణ, ఎస్ఐ రవి, ఒమేగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని నిర్లక్ష్యానికి నిలయంగా మార్చిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి సీపీఐ



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 2 విజన్ ఆంధ్రకుమురం భీం అసిఫాబాద్ జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా లిసీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవిలి మాట్లాడుతూ.... జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో వెలుగులోకి వచ్చిన సూపరిండెంట్ మరియు కొంతమంది వైద్యులు విధుల నిర్లక్ష్యం, నకిలీ హాజరు నమోదు, పర్యవేక్షణ వైఫల్యం అత్యంత ఆందోళనకరమైన విషయం. జిల్లా కలెక్టర్ నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్, కొందరు వైద్యులు విధులకు హాజరు కాకుండానే ముందుగానే హాజరు నమోదు చేయడం, మరికొందరు హాజరు నమోదు చేసిన తర్వాత ఆసుపత్రిని విడిచి వెళ్లడం బయటపడటం ప్రభుత్వ వైద్య వ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన నిర్లక్ష్యానికి నిదర్శనంప్రభుత్వ ఆసుపత్రి అనేది పేదలు, గిరిజనులు, కూలీలు, సామాన్య ప్రజలకు చివరి ఆశ్రయం. అలాంటి ఆసుపత్రిలో బాధ్యతాయుతంగా సేవలందించాల్సిన వైద్యులు విధులను నిర్లక్ష్యం చేయడం వల్ల రోగుల ఆరోగ్యం, ప్రాణాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది కేవలం సేవా నియమావళి ఉల్లంఘన మాత్రమే కాదు, ప్రజల ప్రాణాల పట్ల బాధ్యతారాహిత్యాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.వైద్యుల విధులను పర్యవేక్షించాల్సిన ఆసుపత్రి సూపరింటెండెంట్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించకపోవడం కూడా తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. పర్యవేక్షణలో లోపాలు ఉండటం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి కొనసాగితే వైద్య సేవల నాణ్యత మరింత దిగజారే అవకాశం ఉంది.అందువల్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా శాఖ జిల్లా కలెక్టర్ ను కోరుతున్నది ఏమనగ లివిధులకు హాజరు కాకుండానే హాజరు నమోదు చేసిన వైద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.లివిధులను మధ్యలో వదిలి వెళ్లిన వారిపై కఠిన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి.విధుల పర్యవేక్షణలో విఫలమైన సూపరింటెండెంట్ బాధ్యతను నిర్ధారించాలి.బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేసి, నిరంతర ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి,రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.ప్రజల ఆరోగ్యంతో రాజీ పడే ఎలాంటి నిర్లక్ష్యాన్నైనా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సహించదు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లిసిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిరే ప్రకాష్, పిడుగు శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్,పిప్పిరి వెంకటేష్ శ్రీరామ్ శంకర్‌లి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలు మెరుగుపరచాలి

### . జిల్లా కలెక్టర్ కె హరిత




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 2 విజన్ ఆంధ్ర ల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ ఆసుపత్రులలో వైద్య ఆరోగ్య సేవలు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు ,గురువారం సమీకృత కలెక్టర్ భవన సముదాయంలోని పాలనాధికారి ఛాంబర్ లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆసుపత్రి సూపర్డెంట్ లతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందం తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కింద వైద్యులు ఫార్మసిస్టులు ఏఎన్ఎంల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు వర్షాకాలం దృశ్య నిండిన గర్భిణీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు ఆసుపత్రులలో అవసర పరికరాలు మందులు నిల్వలు అందుబాటులో ఉంచాలన్నారు రోగులను ఆసుపత్రులకు తరలించడానికి అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలన్నారు వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు జిల్లా వైద్య సేవలు మెరుగుపరచాలన్నారు వైద్య కళాశాలలో ఖాళీలను భర్తీ చేయుటకు నోటిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు వైద్య విద్యార్థులను బోధించడానికి అసిస్టెంట్ ప్రొఫెసర్లు నియమించడానికి చర్యలు తీసుకోవాలన్నారు జిల్లా ఆస్పత్రిలో మృతదేహాలను తరలించడానికి పార్థివ వాహనం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారుఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సీతారాం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ ఉపవైద్యాధికారి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

## పెండింగ్ లో ఉన్న ఫీజుల బకాయిలన్నీ విడుదల చేయాలని కోరుతూ కాలేజీ బంద్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 2( విజన్ ఆంధ్ర)ఈరోజు రాష్ట్ర బీసీ జేఏసీ మరియు జాతీయ బీసీ జేఏసీ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు కొమురం భీం జిల్లాలో లికాలేజీ బంద్‌లి కార్యక్రమం బీసీ సంక్షేమ సంఘం కొమురం భీం జిల్లా అధ్యక్షులు రమేష్ రూపునర్. విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లిలోబడే లహు కుమార్‌లి మరియు బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు లిమామిడి కిరణ్‌లి ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినదిఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ కాలేజీలను బందు చేయించిన తర్వాత కొంరం భీమ్ఆసిఫాబాద్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మరియు బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు లిరమేష్ రూపనార్‌లి మాట్లాడుతూ పాత పద్ధతిలోనే ఫీజుల రియంబర్స్మెంట్ విధానాన్ని అమలు చేయాలని గత నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పేద విద్యార్థుల పై చదువులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా ఈరోజు ఇంటర్ మరియు డిగ్రీ కాలేజీలను బందును నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 14 లక్షల విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ చేయకపోవడంతో రాష్ట్రంలో 9 మంది విద్యార్థులు చావుకు బలైనరని బాధను వ్యక్తం చేసినారు. కాలేజీ విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రియంబర్స్మెంట్స్ను పాత పద్ధతిలోనే అమలు చేయాలని మరియు పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మూడు సంవత్సరముల నుండి 12 లక్షల కోట్ల బడ్జెట్ మరియు అప్పుగా తెచ్చినటువంటి నాలుగు లక్షల కోట్ల రూపాయలలో ఒక వెయ్యి కోట్ల రూపాయలైనా ఫీజు రియాబర్స్మెంట్ కి దాఖలాలు లేవని గుర్తు చేశారు. కానీ పెద్ద పెద్ద కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రం పెండింగ్లో ఉంటే 70 వేల కోట్లు సాంక్షన్ చేసి ప్రభుత్వం కేవలం 7000 కోట్లు మాత్రమే ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బాకీలు తొందరగా విడుదల చేయ నట్లయితే ఈనెల 15వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాదులో రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ధర్నా మరియు రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బిసి జేఏసీ సంఘ సభ్యులు మరియు బిసి సంక్షేమ సంఘం విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడే లహు కుమార్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి కిరణ్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కోస్ట్ రైల్వే
విశాఖపట్నం
Follow us on @SCoRailway
వెబ్సైట్: www.scor.indianrailways.gov.in
నెం. బి/ఎస్.జి.టెండరు నోటీస్/ఇ-9-10/ 2026-27 తేది 02.07.2026
PUB/SCoR-653
భారత రాష్ట్రపతి తరపున మరియు వారి కొరకు దిగువ సంతకం చేసిన అధికారి ఈ క్రింది పనుల కోసం 27.07.2026న 15:30 గంటల వరకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.
క్రమ సంఖ్య: 1, టెండర్ నెం. & పని పేరు: SCR-BZA-SNT-E09-OT-2026-27 తేది: 02.07.2026, విజయవాడ డివిజన్: సిగ్నల్ మరియు టెలికాం విభాగం: S&T పనులు - (1) విజయవాడ డివిజన్‌లోని BZA-BVRM సెక్షన్‌లో Km 60/26-28 వద్ద ఉన్న LC గేట్ నం. 69, Km 66/24-26 వద్ద ఉన్న LC గేట్ నం. 76 మరియు GDV-MTM సెక్షన్‌లో Km 30/36-38 వద్ద ఉన్న LC 37 (సిబ్బందితో కూడిన మిడ్-సెక్షన్ LC గేట్లు) వద్ద ప్రతిపాదిత ఇంటర్‌లాకింగ్ పనులు. (2) విజయవాడ డివిజన్‌లోని 9 ఇంటర్‌లాక్డ్ LC గేట్ల వద్ద మెకానికల్ లిఫ్టింగ్ బారియర్ గేట్లకు బదులుగా EOLB (ఎలక్ట్రికల్ ఆపరేటెడ్ లిఫ్టింగ్ బారియర్) ఏర్పాటు చేయడం. టెండర్ విలువ: రూ. 6,28,17,367.50, ఇఎండి: రూ. 12,56,400.00, పని పూర్తి చేయు కాలం: 06 నెలలు.
క్రమ సంఖ్య: 2, టెండర్ నెం. & పని పేరు: SCR-BZA-SNT-E10-OT-2026-27 తేది: 02.07.2026. విజయవాడ డివిజన్ పరిధిలో రైలు రాకపోకల సమాచారాన్ని నివేదించడానికి COA వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడం. టెండర్ విలువ: రూ. 1,27,32,234.00, ఇఎండి: రూ. 2,54,700.00, పని పూర్తి చేయు కాలం: 05 నెలలు.
ముగింపు తేదీ మరియు సమయం: 27.07.2026, 15:30 గంటలు.
1. టెండర్ షరతులు/ఇతర వివరాలు (పని పూర్తి పేరు, పైన పేర్కొన్న పనుల తరహా పనులు, అర్హత ప్రమాణాలు మొదలైనవి) www.ireps.gov.in వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2. టెండర్ల గడువు ముగిసే తేదీకి ముందే, ఏదైనా టెండర్లకు సంబంధించిన మార్పులు/సవరణలను గమనించడానికి, కాబోయే టెండరర్లు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.
3. ఈ టెండర్ నోటీసు, విజయవాడలోని ద.మ. రైల్వే, డివిజనల్ రైల్వే మేనేజర్ (సిగ్నల్ & టెలికాం) కార్యాలయంలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడింది.
4. ఎటువంటి కారణం చెప్పకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు ప్రత్యేకంగా ఉంటుంది.
మా సైటును www.ireps.gov.in లో సందర్శించండి.
డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎస్ & టి) విజయవాడ
SCoR-A057
తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కోసం మరియు టెండర్ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకోవ డానికి, దయచేసి https://www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

## పే అప్‌గ్రేడేషన్, పీఆర్పీ అమలే లక్ష్యం

### ఉద్యమాన్ని ఉధృతం చేసిన సింగరేణి అధికారులు



కొత్తగూడెం బ్యూరో, జూలై 03(విజన్ ఆంధ్ర)సింగరేణి కార్పొరేట్ ఏరియాలో అధికారుల రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. రోజు రోజుకు ఉద్యమానికి మద్దతు పెరుగుతుండగా, అధిక సంఖ్యలో అధికారులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కోల్ ఇండియా అధికారులకు అమలు చేసిన విధంగానే సింగరేణి అధికారులకు కూడా పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని, జీతంలో భాగమైన పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే ను వెంటనే విడుదల చేయాలని, అలాగే ఫ్రీ ఎలక్ట్రిసిటీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, కంపెనీకి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు.గత కొన్ని రోజులుగా సింగరేణిలోని సుమారు 2,500 మంది అధికారులు శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కంపెనీ అభివృద్ధికి సమయంతో సంబంధం లేకుండా సేవలందించే అధికారులకు ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమని, ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కార్పొరేట్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్. వెంకటచారి, కార్యదర్శి ఆర్. కేశవరావు, జాయింట్ సెక్రటరీ ఏ. హరిప్రసాద్, కె. కమలాకర్, ఖజాంచి ఎస్. వెంకటేశం కోరారు.ఈరోజు రిలే నిరాహార దీక్షలో బి. సీతారాం (డీజీఎం ▪ ఈ అండ్ ఎం, (ట్రాన్స్‌పోర్ట్), ఎ. వసంతరావు (డీజీఎంఐఈడీ), డా. కె. విజయ్ కుమార్ (మెడికల్ సూపరింటెండెంట్), జి. సురేష్ (అదనపు మేనేజర్ ▪ పర్యావరణం), డి.వి.ఎస్.ఎన్. ప్రవీణ్ (డిప్యూటీ సీనియర్ ఇంజనీర్ ▪ సివిల్), దేవేందర్ రెడ్డి (డిప్యూటీ పర్సనల్ మేనేజర్), అక్షయ్ (సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్), మంజునాథ్ (సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్) తదితరులు పాల్గొన్నారు.కాగా, శుక్రవారం సింగరేణి వ్యాప్తంగా మహిళా అధికారులు పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్షల్లో పాల్గొననున్నట్లు అధికారులు ప్రకటించారు.

## పామాయిల్ తోటలతో సిరుల పంట వరిని వీడి పామాయిల్ వైపు మళ్లాలి

### 35 ఏళ్ల పాటు స్థిర ఆదాయం
### రైతులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూచించారు. ఇందులో కోకో, వక్క మిరియాలు,తమలపాకు వంటి వివిధ రకాల అంతర పంటలను బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. మూడున్నర ఏళ్ల తర్వాత పామాయిల్ ద్వారా ప్రధాన ఆదాయం రావడం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య ,జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్,వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య,సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి కట్ట. స్వాతి,ఉద్యాన విస్తరణ అధికారులు యారాల సుధాకర్ రెడ్డి, రంగు ముత్యం రాజు, వంగూరి అనిల్,ఆయిల్ ఫెడ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ నిమ్మ గోపికృష్ణ , ఫీల్డ్ ఆఫీసర్ భవిష్య ,రైతులు వెదిరే లక్ష్మీ నరసింహారెడ్డి,కిషన్ రెడ్డి, ఆశబోయిన మల్లేష్ ,బొమ్మగాని సైదులు ,రామకృష్ణ ,తన్నీరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## అమృతలో ఐసీఆర్ఎమ్-26కు పరిశోధనా పత్రాల స్వీకరణ ప్రారంభం

హైదరాబాద్, జూలై 02 (విజన్ ఆంధ్ర) : అమృత విశ్వ విద్యాపీఠం ఆధ్వర్యంలో డిసెంబర్ 17-19, 2026 తేదీల్లో అమృతపురి క్యాంపస్‌లో జరగనున్న ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రోబోటిక్స్, మేట్రానిక్స్(ఐఆర్సీఎమ్-26) కోసం పరిశోధనా పత్రాల స్వీకరణ ప్రారంభమైనట్లు హ్యూమానిటేరియన్ టెక్నాలజీ(హెచ్యూటీ) ల్యాబ్స్ డైరెక్టర్, ఐఈఈఈ-26 ఆర్గనైజింగ్ ఛైర్ డా.రాజేష్ కన్నన్ మేగలింగం గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పత్రాల సమర్పణకు జూలై 15, 2026 చివరి తేదీ అని తెలిపారు. ఐఈఈఈ కేరళ సెక్షన్, ఐఈఈఈ రోబోటిక్స్, ఆటోమేషన్ సొసైటీ సహకారంతో హైబ్రిడ్ విధానంలో నిర్వహించే ఈ సదస్సులో ఎంపికైన పత్రాలను ఐఈఈఈ ఎక్స్‌ప్లోర్ లో ప్రచురించి స్కోపస్ లో ఇండెక్స్ చేయనున్నట్లు తెలిపారు. రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ఏఐ, ఆటోమేషన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ప్రధానాంశాలుగా ఉంటాయని తెలిపారు. యువ పరిశోధకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో ప్రధాన ప్రసంగాలు, వర్క్‌షాప్‌లు, రోబోటిక్స్ పోటీలు, రోబో ఎక్స్‌పో, ఈవీ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు చెప్పారు

## కేఎల్‌హెచ్ కు 'ఇన్‌స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ అవార్డు'




హైదరాబాద్, జూలై 02 (విజన్ ఆంధ్ర) : సామాజిక సేవ, సమాజాభివృద్ధి కార్యక్రమాలు, మానవతా సేవల్లో విశిష్ట కృషి చేసినందుకు కేఎల్‌హెచ్ బాచుపల్లి క్యాంపస్‌కు పి.వి.నరసింహారావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతిష్ఠాత్మక 'ఇన్‌స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ అవార్డు'ను ప్రదానం చేసిందని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు కొనేరు లక్ష్మణ్ హవిష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా.ఎల్.కోటేశ్వరరావు తోకలసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన, పరిశుభ్రత, విద్యా విస్తరణ, పర్యావరణ పరిరక్షణ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలోని సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. విద్యార్థులను సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో 34 వేల విద్యార్థుల నమోదు లక్ష్యం సాధించాలి

### ఆన్‌లైన్ టీసీ దరఖాస్తులు వెంటనే క్లియర్ చేయాలి
### డ్రాప్‌బాక్స్‌లో పెండింగ్‌లు లేకుండా పర్యవేక్షణ
### సహకరించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు
### కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-02(విజన్ ఆంధ్ర)జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి, 34 వేల మంది విద్యార్థుల నమోదు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జీరో నమోదు, 15 లేదా అంతకంటే తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చే ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ) దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత పాఠశాలలు వెంటనే డ్రాప్‌బాక్స్‌లో స్వీకరించి సకాలంలో క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రాప్‌బాక్స్‌లో ఎలాంటి పెండింగ్‌లు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.నిబంధనలు పాటించని, సహకరించని ప్రైవేట్ పాఠశాలలకు వివరణ కోరుతూ చర్యలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉపాధ్యాయులందరూ ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు లేదా "ఆన్ డ్యూటీ" నమోదును తప్పనిసరిగా చేయాలని, సెలవులో ఉన్న ఉపాధ్యాయుల దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే ఆమోదించడం లేదా తిరస్కరించడం చేయాలని సూచించారు.ఎఫ్ఆర్ఎస్‌లో తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, హాజరు నమోదులో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సెక్టోరియల్ అధికారి మల్లేష్ గౌడ్ ,మండల విద్యాధికారులు, సంబంధిత ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# కూలీలకు అల్పాహారం అందించిన బిజెపి నేత



నారాయణపేట, జూలై 2(విజన్ ఆంధ్ర) కూలీలకు అల్పాహారాన్ని అందించిన ఉట్కూరు మండల పరిధిలోని బిజ్వార్ గ్రామానికి చెందిన హెచ్ నరసింహా ను రాష్ట్ర బిజెపి నేత కొండయ్య అభినందించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బి. కొండయ్య 62 వ పుట్టినరోజు సందర్భంగా సామాజిక కార్యకర్త నరసింహా నారాయణ పేట జిల్లా కేంద్రంలోని లీకైనా మిషన్ భగీరథ పైపుల పనులు చేస్తున్న రాజస్థాన్ కూలీలకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొండయ్య నారాయణ పేట జిల్లా మరియు మక్తల్ అసెంబ్లీ అభివృద్ధి కోసం అనేక పోరాటాలు చేశారాని తెలిపారు. బీజేపీ పార్టీలో అనేక ఇబ్బందులు వచ్చిన కూడా పార్టీ సిద్ధాంతం కోసం అన్ని భరిస్తూ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ఎవరికీ తల వంచకుండా నీతిగా, నిజాయితీగా ప్రజల కోసం, పార్టీ కార్యకర్తల కోసం అనేక అవమానాలు కల్గించిన కూడా ఉమ్మడి జిల్లాలో కమలం జెండా ఎగురావేటయుటకు వారు చేసిన కృషి అభినందనీయం అని పేర్కొన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజపేయి చూపిన మార్గంలో ప్రయాణిస్తూ అట్టుడుగు స్థాయి వారికి అభివృద్ధి ఫలాలు అందడం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు అని అన్నారు. భవిష్యత్ లో గొప్ప పదవి చేపట్టి పేద ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు ఇవ్వాలని ప్రార్తించారు.

# ఎట్టకేలకు...సాధుల్లా నగర్‌లో త్రీఫేజ్ విద్యుత్ వైర్ల సమస్య పరిష్కారం



మల్కాజిగిరి, జూలై 2,(విజన్ ఆంధ్ర): మౌలాలి సాధుల్లా నగర్‌లో త్రీఫేజ్ విద్యుత్ వైర్లు సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఈ కాలనీలో విద్యుత్ వైర్లుఅస్తవ్యస్తంగా ఉండి ఇళ్లకు, మసీదుకు తాకుతూ, సుమారు 6 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డులో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ సమస్య కారణంగా స్థానిక ప్రజలు గత కొంతకాలంగా ఆందోళనకు గురవుతూ అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు మౌలాలి డివిజన్ కాంగ్రెస్ నాయకుల దృష్టికి తీసు కెళ్లగా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహాయంతో బుధవారం మౌలాలి డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. సమస్యను పరిశీలించిన అనంతరం సుమారు 80 మీటర్ల మేర త్రీఫేజ్ కేబుల్‌లను ఏర్పాటు చేయడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. చాలా కాలంగా నెలకొన్న ఈ సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు, మైనంపల్లి హనుమంతరావుకు, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షకీల్, సిద్ధిక్, కాలనీవాసులు మహమ్మద్ సాదిక్, సమీర్, ఇర్ఫాన్, మదర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

## - కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 02 (విజన్ ఆంధ్ర) పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తకోట, మదనాపూర్ మండలాల అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరై ప్రారంభం కాని కొత్తకోటలోని 58, మదనాపూర్‌లోని 28 ఇళ్లను తక్షణమే గ్రౌండింగ్ చేసి పనులు మొదలుపెట్టాలన్నారు. లబ్ధిదారులు ప్రైవేట్ అప్పుల బారిన పడకుండా ఎస్‌హెచ్‌జీల ద్వారా రుణాలు అందేలా చూడాలని సూచించారు. కొత్త ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసించే వారికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులను వేగంగా గుర్తించి వివరాలు తన లాగిన్‌కు పంపాలని ఆదేశించారు. ప్రతి అధికారి రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ బాధ్యతగా పనిచేయాలన్నారు. **దొడ్డు రకం వరి వద్దు: సన్న రకానికే బోనస్**

రైతులు దొడ్డు రకం, ధాన్ రకం వరి వేయకుండా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సన్న రకం వరికే ప్రభుత్వ బోనస్ వస్తుందని, పంట మార్పిడిపై అవగాహన కల్పించాలన్నారు. విత్తన డీలర్లతో సమావేశమై నష్టం కలిగించే రకాలను విక్రయించవద్దని ఆదేశించాలని, నానో యూరియాపై కూడా అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు కార్యాలయ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, హౌసింగ్ పీడీ విఠోబా, డీఏఓ ఆంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సునీత పల్లవి, మండల అధికారులు పాల్గొన్నారు.

# స్థిరమైన జీవనోపాధులు, సురక్షిత వలసలు సమాజ స్థైర్య నిర్మాణానికి కృషి చేయాలి

## - జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



నారాయణపేట, జూలై 2(విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లాలో స్థిరమైన జీవనోపాధులు, సురక్షిత వలసలు, సమాజ స్థైర్య నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఎఫ్ ఏ వో, ఐ ఓ ఎం, నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, వాసన్ సంయుక్తంగా అమలు చేస్తున్న మైగ్రేషన్ మల్టీ-పార్ట్నర్ ట్రస్ట్ ఫండ్ సంయుక్త కార్యక్రమ మూడవ జిల్లా స్థాయి కమిటీ (డి ఎల్ సి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అభివృద్ధి భాగస్వాములు, కార్యక్రమ అమలును సంస్థల ప్రతినిధులు పాల్గొని, కోస్గి, గుండుమల్ మండలాల్లోని వలస కుటుంబాల సామాజిక-ఆర్థిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలు, సురక్షిత వలస సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అనుసంధానంపై కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. సమావేశంలో మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్ ( ఎం ఆర్ సి ), మొబైల్ మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్ (ఎం ఎం ఆర్ సి ) ప్రవాసి హెల్ప్‌లైన్ పనితీరును కూడా సమీక్షించారు. వలస కార్మికులు వారి కుటుంబాలకు సమాచారం, మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్, సహాయ సేవలు అందిస్తున్న ఈ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ముఖ్యంగా కార్మిక కార్డులు, ఇతర సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ సేవలకు ఒకే వేదికగా మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమం కింద సాధించిన విజయాలు వలస కుటుంబాలకు చెందిన 40 మంది మహిళలకు సమూహాల వారీగా మేకల పెంపకానికి అవసరమైన షెడ్లు, ప్రతి బృందానికి 30 మేకలు, 2 మగ మేకలను అందజేసి జీవనోపాధి అవకాశాలను కల్పించినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. అలాగే కోస్గి, గుండుమల్ మండలాల్లో మహిళల స్వయం సహాయక సంఘాల ద్వారా పేపర్ ప్లేట్ తయారీ యూనిట్లు సహా మొత్తం ఏడు మహిళా ఆధ్వర్యంలోని సూక్ష్మ వ్యాపారాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించడం వలస, బలహీన వర్గాల కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాల కోసం ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు. మొబైల్ మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్, ప్రవాసి హెల్ప్‌లైన్ ద్వారా సురక్షిత, క్రమబద్ధమైన చట్టబద్ధమైన వలసలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నారాయణపేటలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ ఏర్పాటు చేయడం, యువత ఉపాధి అవకాశాలను పెంపొందించడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించడం, మహిళల జీవనోపాధి అవకాశాలను విస్తరించడం, కిచెన్ గార్డెనింగ్‌ను ప్రోత్సహించడం, కోస్గి చంద్రవంచ, అప్పాయిపల్లిలో ఆర్.ఓ. తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేయడం, అలాగే గ్రామీణ సమగ్రాభివృద్ధి కోసం వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు. ఎం ఎం పీ టీ ఎఫ్ సంయుక్త కార్యక్రమం కింద సాధించిన పురోగతిని అభినందించిన జిల్లా కలెక్టర్ , ఎఫ్ ఏ వో, ఐ వో ఎం, ఎన్ డబ్ల్యు డబ్ల్యు టి , వాసన్ భాగస్వాములు, జిల్లా శాఖల సమిష్టి కృషిని ఎంతో ప్రశంసించారు. ఈ కార్యక్రమం మరింత విస్తరించి, ఎక్కువ మంది వలస కుటుంబాలు స్థిరమైన జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, సురక్షిత వలస సేవలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా అన్ని శాఖలు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నారాయణపేట స్థానిక ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండ్‌ను అభివృద్ధి చేయడం, భారీ స్థాయిలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించి, జిల్లా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశం చివరగా మహిళలు, యువత సాధికారత, స్థిరమైన జీవనోపాధి, సురక్షిత, క్రమబద్ధమైన గౌరవప్రదమైన వలసలను ప్రోత్సహిస్తూ నారాయణపేట జిల్లాలో మరింత స్థైర్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని సంకల్పించారు. అనంతరం భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, ఎఫ్ ఏ వో నుంచి జగన్, ఐ వో ఎం రాష్ట్ర సమన్వయకర్త జలజ, సహాయ సమన్వయకర్త మార్ట్ ఆశీర్, కోస్గి, గుండుమల్ ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరిక




సిద్దిపేటజిల్లా ప్రతినిధి 02 జులై సిద్దిపేటజిల్లాలో యూరియా పంపిణీలో అక్రమాలకు పాల్పడే వారిపై పైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు ఇటీవల చేర్యాల మండలంలో శ్రీసాయి శివ ఫెర్టిలైజర్ సేల్స్ షాప్ లో యూరియా సరఫరా లో కొంత అక్రమాలు జరిగినట్టు మా దృష్టికి రావడం జరిగిందని వెంటనే జిల్లా వ్యవసాయ అధికారి ద్వారా ఎంక్వయిరీ చేసినప్పుడు ప్రాథమిక ఎంక్వయిరీ రిపోర్టులో శ్రీ సాయి శివ ఫెర్టిలైజర్ సేల్స్ షాప్ అతను సందీప్ రెడ్డి ఈ పాస్ మిషన్ ద్వారా హోల్సేల్ డీలర్స్ నుంచి 6429 బ్యాగుల యూరియాని తీసుకొని దానిని కన్ఫర్మేషన్ చేయకుండా అక్రమంగా ఇతనే రైతుల పేర్లను రైతుల ఆధార్ కార్డు ఆధారంగా తీసుకొని సేల్ చేసినట్టు చూపించి అక్రమాలకు పాల్పడినట్టు తెలిసిందని అన్నారు. ఈ విధంగా యూరియాను మిస్ యు చేశారు కాబట్టి ఇతనిపై వెంటనే ఎంక్వయిరీ చేసి పోలీస్ కేసు నమోదు చేయడంతో వెంటనే అతన్ని పోలీసులు అరెస్టు చేశారన్నారు. అలాగే అతని లైసెన్సును కూడా వ్యవసాయ శాఖ రద్దు చేసిందని తెలిపా సిద్దిపేట అర్బన్ మండలంలోని శ్రీఆంజనేయ ఫర్టిలైజర్స్, శ్రీగణేష్ ట్రేడర్స్ హోల్ సేల్ డీలర్ల నుండి ఇతనికి యూరియా బ్యాగులను సప్లై చేయడం జరిగిందని, ప్రాథమిక విచారణలో వీరు సప్లై చేసిన యూరియా మిస్ యూస్ అయింది కాబట్టి మరు ఇందులో ఇన్వాల్వ్ అయి ఉన్నారు కాబట్టి ఈ రెండు షాపులు శ్రీ ఆంజనేయ ఫెర్టిలైజర్స్ మరియు శ్రీగణేష్ ట్రేడర్స్ ల లైసెన్స్ లను వ్యవసాయ శాఖ డైరెక్టర్ రద్దు చేశారని తెలిపారు. అదేవిధంగా యూరియా డైవర్షన్ జరుగుతున్న, అక్రమాలు జరుగుతున్న చేర్యాల మండల వ్యవసాయ అధికారి భోగేశ్వర్ స్వామి సరిగా పర్యవేక్షణ చేయకపోవడం మూలంగా వెంటనే అతని విధుల్లో నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారుఈ యూరియా మిస్ యూస్ సంఘటనలో ప్రమేయం ఉన్న ఇతరుల గురించి కూడా ఎంక్వయిరీ చేస్తున్నామని గుర్తించిన తర్వాత వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూరియా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి రైతులకు సబ్సిడీతో పంపిణీ చేసేందుకు వస్తుందని, ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రకారం యూరియా అక్రమ సరఫరాకు ఎవరు పాల్పడిన, యూరియా అక్రమాలకు పాల్పడిన వారి పైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి అధికారం ఉందని కాబట్టి జిల్లాలో ఎలాంటి యూరియా అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# రైతు భరోసా నిధులను సకాలంలో విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## - కాంగ్రెస్ పార్టీ పేట పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్,



నారాయణపేట, జూలై 2 (విజన్ ఆంధ్ర) రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా నిధులను సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి కి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నియోజక వర్గ ఇన్ ఛార్జ్ కుంభం శివకుమార్ రెడ్డికి నారాయణపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ తరఫున పట్టణ అధ్యక్షుడు కర్రె వెంకటేష్ గౌడ్ గురువారం కృతజ్ఞతలు ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న రైతు భరోసా పథకం రైతులకు ఆర్థిక అండగా నిలుస్తోందనీ, ఈ నిధులు సకాలంలో అందడంతో రైతులు వ్యవసాయ పనులను ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించ గలుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. నారాయణపేటలోని ప్రతీ రైతుకు కూడా ఈనెల 15 తేదీ లోపు రైతు భరోసా నిధులు ఖాతాలలో జమ చేస్తారనీ, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెంకటేష్ గౌడ్ తెలిపారు. రైతుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి నారాయణపేట ప్రజల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని వెంకటేష్ గౌడ్ ఆకాంక్షించారు.

# గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి
## మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
## రోజువారీ ఎక్స్‌రే నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలి
## కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-02(విజన్ ఆంధ్ర)గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రామగుండంలోని గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ సెంటర్, అన్ని వార్డులు, ఇన్‌పేషెంట్ (ఐపీ) విభాగం, ప్రయోగశాలలు, ఎక్స్‌రే విభాగం, ఆసుపత్రి ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఎక్స్‌రే పరీక్షల నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న లిఫ్ట్‌ను మాన్యువల్ ఆపరేషన్ విధానంలోకి మార్చేందుకు తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ద్వారా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో కొత్త లిఫ్ట్ ఏర్పాటు చేయడంతో పాటు భద్రత దృష్ట్యా ఆరు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన రెండు ఫ్యూమిగేటర్లు, రెండు కంప్యూటర్లు, రెండు రిఫ్రిజిరేటర్లు, ప్రయోగశాలలకు ఐదు యూపీఎస్‌లు, ఒక ప్రింటర్ కొనుగోలు చేసేందుకు టీఎస్ఎంఎస్ఐడీసీ ద్వారా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను త్వరితగతిన కల్పించి, ఆసుపత్రి సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు, ఆర్ఎంఓ కృపా బాయి, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరంగనాయక స్వామిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 02 (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని గురువారం కుటుంబ సభ్యులతో కలిసి వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాయక స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మొక్కలను అందజేసి ఘన స్వాగతం పలికారు. ఆలయ అధికారులు మంగళవాయిద్యాలతో సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాలను, మ్యూజియంలోని చారిత్రక చిత్రాలు, కళాఖండాలను పరిశీలించి ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, స్థానిక సర్పంచ్ మద్దిలేటి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏ .ఐ. ఎఫ్. డి. ఎస్. నిరసన





శేరిలింగంపల్లి జూలై 2 విజన్ ఆంధ్ర అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డిఎస్) ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ) కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమం ఎ ఐ.ఎఫ్ . డి ఎస్ కార్యదర్శి ముత్తన్న గారి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏ. ఐ .ఎఫ్. డి . ఎస్. రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి మాట్లాడుతూ, ఎం. ఎన్. ఆర్. స్కూల్ యాజమాన్యం విద్యార్థులు, తల్లిదండ్రులపై అక్రమ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో కొనసాగిస్తున్న దోపిడీని వెంటనే అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యను వ్యాపారంగా మార్చడం ఆందోళనకరమని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించాలని కోరారు. ముఖ్యంగా మియాపూర్ జడ్.పి.హెచ్.ఎస్. ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలను ఎం. ఈ. ఓ.వెంటనే పరిష్కరించి, ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఏ. ఐ. ఎఫ్. డి. ఎస్ .ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎన్.ఆర్. స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు అరుణ్ శ్రీరామ్, దుర్గాప్రసాద్, గణేష్, , రిషిక్, వివేక్, రాజేష్, సన్నీ తదితరులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఉస్మాన్ మటన్ షాప్ పేరుతో మటన్ లో బీఫ్ కలిపి హోటళ్లకు సరఫరా వ్యక్తి అరెస్ట్.

.హైదరాబాద్: మల్లేపల్లి, హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మటన్‌లో బీఫ్ కలిపి పలువురు హోటళ్లకు సరఫరా చేస్తున్నాడనే ఆరోపణలపై ఉస్మాన్ అనే వ్యక్తిని సీసీఎస్ (అఈూ) క్రైమ్ ఇద్దరిని అదుపులోకి తీసుకొని ఊఈజీబబి కు అప్పగించడం జరిగింది. అనంతరం హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఉస్మాన్ నిర్వహిస్తున్న మటన్ షాప్‌లో మటన్‌తో పాటు బీఫ్‌ను కలిపి విక్రయించి హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అనంతరం నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం హబీబ్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన హబీబ్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఉచిత బిర్యాని ప్యాకెట్ల పంపిణీ.. ఎగబడ్డ జనాలు

## -సరైన ఏర్పాట్లు చెయ్యని నిర్వాహకులు
## -తోపులాటలో పలువురు మహిళలకు గాయాలు
## -ఏదైనా ప్రమాదం జరిగితే ఏంటి అని ప్రశ్నిస్తున్న ప్రజలు



హన్మకొండ జిల్లా బ్యూరోచీఫ్ జులై 2(విజన్ఆంధ్ర) ఉచితంగా 300 బిర్యానీ ప్యాకెట్లు పంచుతామని ఓ రెస్టారెంట్ నిర్వాహకులు చేసిన ప్రచారానికి ప్రజలు పెద్ద సంఖ్యలోఎగబడ్డారు. హనుమకొండ కెయూ క్రాస్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సురభి ఫుడ్ కోర్టు నిర్వాహకులు ఉచిత బిర్యాని ప్యాకెట్లు పంచుతామని పెద్ద ఎత్తున ప్రచారం చేసి సరైన ఏర్పాట్లు చేయకుండా నిర్వాహకులు చిన్న సందులో ప్యాకెట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం వల్ల ప్రజలు ఒకరికొకరు తోసుకొని తీవ్ర గందరగోళం ఏర్పడింది. వ్యాపార ప్రచారం మీద ఉన్న శ్రద్ధప్రజలకు సౌకర్యాలు కల్పించుడంలో నిర్వాహకులు పూర్తిగా విఫలమై పేద ప్రజల ప్రాణాలతోచెలగాటమాడుతున్నారు అనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉరుకొండ పర్యటన,

## ముఖ్యమంత్రి పర్యటనలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవు,

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జులై 02ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 4వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండల పరిధిలోని ఉరుకొండపేట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి ఉరుకొండపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి జరుగుతున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న నూతన హెలిప్యాడ్ నిర్మాణ పనులను కలెక్టర్ , ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి ఆలయానికి ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గం, భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.అనంతరం ఆలయ ఈవో, అర్చకులతో సమావేశమైన కలెక్టర్, ముఖ్యమంత్రి నిర్వహించే ప్రత్యేక పూజలు, ప్రదక్షిణలు, పూర్ణకుంభ స్వాగతం, దర్శన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.దేవాలయ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి



ఆలయ వెలుపల ఏర్పాటు చేసిన ప్రాంగణంలో కొంతమంది ప్రముఖులతో కలిసి మధ్యాహ్న భోజనంలో పాల్గొననున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అతిథులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం ఉరుకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి శాఖలవారీగా అప్పగించిన బాధ్యతలను మరోసారి సమీక్షించి అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని పేర్కొన్న కలెక్టర్, ఏ ఒక్క అధికారి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.హెలిప్యాడ్ నుంచి ఆలయానికి చేరుకోవడం, దర్శనం అనంతరం ప్రముఖులతో భోజన కార్యక్రమం వరకు ప్రతి దశలో వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.ˆద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రవాణా, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా వీఐపీల పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వెంట పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటాలని, పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా ప్రస్తుతం సాగు సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో మండల పరిధిలో రైతులకు విత్తనాలు, యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి చిన్న అంశాన్ని కూడా అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ హేమంతకేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అరుణ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, కల్వకుర్తి డి.ఎస్.పి, ఆలయ ఈవో సత్య చంద్రా రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 02,(విజన్ ఆంధ్ర)ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలం మద్దికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల తహసిల్దార్ సదానందం తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన

### -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 02,(విజన్ ఆంధ్రమండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలల్లోని తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలలకు పంపించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, విద్యార్థులు గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్, పైపు లైన్ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి సందర్శించారు. ప్రజలకు నిరంతరంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసే విధంగా గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 2 (విజన్ ఆంధ్ర)కుమురం రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ షీ టీమ్, ఆసిఫాబాద్ పట్టణం లోని ఝౌ=జీజ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షీ టీం సభ్యులు విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రేరణాత్మక తరగతులు నిర్వహించి, ప్రాధాన్యతను వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు.అలాగే సోషల్ మీడియా లో వ్యక్తిగత ఫోటోలు పోస్ట్ చేయవద్దని, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల దుష్ప్రభావాలను వివరించారు. సోషల్ మీడియా కారణంగా కలిగే మానసిక ఒత్తిడి, వల్ల చదువు సన్నగిల్లుతుందని అన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆసిఫాబాద్ షీ టీం ఫోన్ నంబర్ 8712670564 కు సమాచారం అందించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో షీ టీం ప్రిన్సిపాల్ అరుణ శ్రీ , సిబ్బంది స్వప్న, రజని తదితరులు పాల్గొన్నారు.

# మలక్‌పేట్ యశోదలో అరుదైన బీటింగ్

## హార్ట్ బైపాస్ శస్త్రచికిత్స విజయవంతం

వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 02 (విజన్ ఆంధ్ర) అత్యంత ప్రమాదకరమైన లెఫ్ట్ మెయిన్ కొరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెసెల్ డిసీజ్‌తో బాధపడుతున్న వనపర్తి జిల్లాకు చెందిన 61 ఏళ్ల ఎస్. కృష్ణప్రసాద్‌కు మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.గుండె ఆపకుండా మూడు బైపాస్ గ్రాఫ్టులుగత ఆరు నెలలుగా ఛాతీ నొప్పితో బాధపడుతున్న కృష్ణప్రసాద్‌కు పరీక్షల్లో లెఫ్ట్ మెయిన్ కొరోనరీ ఆర్టరీతో పాటు మూడు రక్తనాళాల్లో తీవ్ర అడ్డంకులు, టైప్-2 మధుమేహం ఉన్నట్లు తేలింది. వెంటనే బైపాస్ అవసరమని గుర్తించిన వైద్యులు, కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ & వాస్క్యులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి ఎస్. ఆధ్వర్యంలో ఆఫ్-పంప్ కొరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ చేశారు. హార్ట్-లంగ్ మెషిన్ వాడకుండా గుండె కొట్టుకుంటుండగానే మూడు బైపాస్ గ్రాఫ్టులను అమర్చారు. రైట్ కొరోనరీ ఆర్టరీకి ఎండార్టరెక్టమీ కూడా చేశారు.శస్త్రచికిత్స అనంతరం వేగంగా కోలుకున్న రోగిశస్త్రచికిత్స అనంతరం కార్డియాక్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో ప్రత్యేక పర్యవేక్షణ అందించాయి. వెంటిలేటర్ సపోర్ట్, ఆక్సిజన్ థెరపీ, గుండె మందులు, మధుమేహ నియంత్రణ, ఫిజియోథెరపీతో రోగి వేగంగా కోలుకున్నారు. మొదటి రోజే వెంటిలేటర్ నుంచి తొలగించారు. ఎటువంటి ప్రధాన సమస్యలు లేకుండా రోగి స్వయంగా నడిచే స్థితికి చేరుకొని స్థిరంగా డిశ్చార్జ్ అయ్యారు.వైద్యుల అభిప్రాయం"లెఫ్ట్ మెయిన్, ట్రిపుల్ వెసెల్ డిసీజ్ ఉన్న రోగులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటారు. గుండెను ఆపకుండా బీటింగ్ హార్ట్‌పై బైపాస్ చేయడం అత్యున్నత నైపుణ్యంతో




కూడిన ప్రక్రియ. సకాలంలో శస్త్రచికిత్స చేయడం వల్లే మంచి ఫలితం వచ్చింది" అని డా. వెంగల్ రెడ్డి తెలిపారు. క్రిటికల్ కేర్ హెచ్‌ఓడీ డా. కలాధర్ ఎస్. మాట్లాడుతూ, నిరంతర ఐసీయూ పర్యవేక్షణ, బహుళ విభాగాల సమన్వయం రోగి కోలుకోవడంలో కీలకమన్నారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. వెంకట్ రెడ్డి బి. మాట్లాడుతూ, ముందస్తు నిర్ధారణ, సకాలంలో బైపాస్‌తో ప్రాణాపాయాన్ని నివారించవచ్చన్నారు.యశోద యాజమాన్యం స్పందనఈ విజయం తమ ఆసుపత్రిలోని అత్యాధునిక గుండె వైద్య సేవలకు నిదర్శనమని డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఏవీపీ శ్రీనివాస్ చిదుర తెలిపారు. ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, కార్డియాక్ ఐసీయూలు, నిపుణుల సమన్వయంతో క్లిష్ట గుండె వ్యాధులకు విజయవంతంగా చికిత్స అందిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి ఎ. వాసుకిరణ్ రెడ్డి ˙ 97057 71230, 99499 98378

# నూతన ఎక్సైజ్ అధికారిని సన్మానించిన రాచాల




వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 02 (విజన్ ఆంధ్ర) వనపర్తి జిల్లా నూతన ఎక్సైజ్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన లింగాచారిని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ గురువారం ఘనంగా సన్మానించారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో నూతన అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన యుగంధర్ గౌడ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖలో కీలకమైన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించాలని, అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పొలిటికల్ జేఏసీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తిచేయాలి

## అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

వనపర్తి జిల్లా ప్రతినిధి జులై 02 (విజన్ ఆంధ్ర)ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేలా అధికారులు వేగంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని గురువారంతో పూర్తిచేయాలన్నారు. ఫారాలను పంపిణీ చేయడంతో పాటు వాటిని సక్రమంగా నింపే విధానంపై ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పంపిణీ నెమ్మదిగా సాగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేయాలన్నారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను సేకరించాలని, ఓటర్లు నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి



సంబంధిత పత్రాలతో ధ్రువీకరించాలని తెలిపారు. సేకరించిన ఫారాలను భద్రంగా ఉంచడంతో పాటు డేటా ఆన్‌లైన్ ఎంట్రీని పొరపాట్లు లేకుండా పూర్తిచేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి గడువులోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల రెవెన్యూ అధికారులు హాజరయ్యారు.

## చదువును మధ్యలో ఆపవద్దు...

### ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

### ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 2(విజన్ ఆంధ్ర)సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు గురువారం టిడబ్ల్యూ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ఆసిఫాబాద్ ను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక (మోటివేషన్) తరగతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నత విద్య, కెరీర్ ప్రణాళిక, లక్ష్య సాధన, పోటీ పరీక్షలు మరియు భవిష్యత్తులో అందుబాటులో ఉన్న వివిధ అవకాశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి పూర్తయిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ చదువును మధ్యలో నిలిపివేయవద్దని సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలు తదితర రంగాల్లో ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తూ విద్య ద్వారానే తన భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు వోకాబ్యులరీ (ఏశీఝఎబశ్రీఖతీఎ) ఆధారిత పదాల ఆటలను నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని ఆంగ్ల పదసంపదను పెంపొందించుకోవడంతో పాటు నేర్చుకునే ప్రక్రియను ఆనందదాయకంగా మార్చుకున్నారు.అనంతరం ప్రాజెక్టు అధికారి ఆసిఫాబాద్‌లోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)ను సందర్శించి శిక్షణా కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడి, ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి, స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. కేంద్రంలో అందిస్తున్న శిక్షణ నాణ్యత, హాజరు, సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, యువజన శిక్షణ కేంద్రం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జూలై 4 నుంచి ఉపాధ్యాయుల నిరసనలు

## 12 ప్రధాన డిమాండ్లతో టీపీయూఎస్ ఆందోళనకు పిలుపు



ములుగు, జూన్ 30;విజన్ ఆంధ్ర ప్రతినిధి జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 అమలుతో పాటు పెండింగ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ జూలై 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య ప్రకటించారు.జూలై 4న మండల, కాంప్లెక్స్ స్థాయిలో, జూలై 14న జిల్లా స్థాయిలో, జూలై 24న రాష్ట్ర స్థాయిలో ధర్నాలు నిర్వహించనున్నారు. ములుగు జిల్లాలో ఈ డిమాండ్ల సాధన కోసం నిరసనలు, ధర్నాలు చేపట్టనున్నట్లు టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి, ప్రధాన కార్యదర్శి గోనే రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రధాన డిమాండ్లు: 1. పీఆర్సీ రిపోర్ట్ తెప్పించి 51% ఫిట్‌మెంట్ ప్రకటించాలి. 2. పెన్షనర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి. 3. ఆరు డీఏలు వెంటనే ప్రకటించాలి. 4. 317 జీవో బాధితులకు 190 జీవో ప్రకారం ఉత్తర్వులు ఇవ్వాలి. 5. 2003 డీఎస్సీ టీచర్లకు ఏపీ తరహాలో పాత పెన్షన్ వర్తింపజేయాలి. 6. సీపీఎస్ రద్దు చేసి అందరికీ పాత పెన్షన్ అమలు చేయాలి. 7. కేజీబీవీ మహిళా టీచర్లకు 29 రోజుల సమ్మె జీతం చెల్లించి, మినిమం టైం స్కేల్ ఇవ్వాలి. 8. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి. 9. స్కూల్ గ్రాంట్స్, అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు జూలై మొదటి వారంలోనే విడుదల చేయాలి. 10. గిరిజన, ఆశ్రమ, బీసీ, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, ఎయిడెడ్ స్కూళ్ల టీచర్ల సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలి. 11. వర్క్ అడ్జస్ట్‌మెంట్ జీవో 25 సవరించి ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు టీచర్లు ఉండేలా జూలై 31 కటాఫ్‌గా నిర్ణయించాలి.

# బీసీ డిక్లరేషన్ అమలు కై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

## బిఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావు కు వినతి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 02,(విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో మేము అధికారంలోకి వస్తే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో నిలదీయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ను కోరారు.మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి లో నిర్వహించిన సింగరేణి పరిరక్షణ సదస్సు కు విచ్చేసిన తన్నీరు హరీష్ రావుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధతతో కూడిన మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచి వాటిని ఏ బి సి డి గ్రూపులుగా వర్గీకరిస్తామని చెప్పారన్నారు. ప్రభుత్వ టెండర్లు సివిల్ మెయింటెనెన్స్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు,బీసీ కార్పొరేషన్ ఫెడరేషన్ల కింద నమోదైన ప్రతి సొసైటీకి ఎన్నికల నిర్వహణ తోపాటు అలాగే పది లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పిన హామీ ఆటకెక్కిందన్నారు.బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకై ఎలాంటి పూచికత్తులేకుండా పది లక్షలు రుణాలు అందిస్తామని,జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెడతామన్నారని,ఐదేళ్లలో బీసీల సంక్షేమానికి లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్, తీరా అధికారం చేపట్టి మూడు సంవత్సరాలు అవుతున్న ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీని అమలు చేసిన పాపన పోలేదని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ను అమలు చేసే విధంగా బిఆర్ఎస్ పార్టీ పలు ఆందోళనలు చేపట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు వడ్డేపల్లి మనోహర్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాచర్ల సదానందం, నాయకులు కంపరి వేణుగోపాల్, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బీ.ఎల్. ఓ.విధులతో అంగన్వాడీలపై భారం..!

## గుడెందొడ్డి రిజర్వాయర్ డిపిఆర్ఓ సర్వేను పరిశీలించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



ధరూర్ జులై 02 (విజన్ ఆంధ్ర బ్యూరో) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పరిధిలో గూడ్డెందొడ్డి రిజర్వాయర్ డిపిఆర్ఓ సర్వేను నిర్మాణం పనులు దక్కించుకున్న కంపెనీ ఇంజనీర్లతో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పరిశీలించాగరు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూగద్వాల నియోజకవర్గంలో తాగు, సాగు నీటిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యం పెంపుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో నియోజకవర్గంలో గుడెందొడ్డి, ర్యాలంపాడు, గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు అందించడం జరుగుతుందన్నారు . ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గుడెందొడ్డి రిజర్వాయర్ ను పరిశీలించడం జరిగిందని వివరించారు. సర్వే దగ్గరకు వచ్చిన గుడెందొడ్డి గ్రామస్తులతో ఎమ్మెల్యే, సర్వే అధికారులు మాట్లాడి వారికున్న కొన్ని అనుమానాలను నివృత్తి చేశారు. గూడెందొడ్డి గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజర్వాయర్ ఆనకట్ట కట్టడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా దిగువన ఉన్న గ్రామానికి నీటి ఊట రాకుండగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయంలో మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ సర్పంచ్ రఘు వర్ధన్ రెడ్డి , అధికారులు నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, కురుమన్న, నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల కష్టాలు..అధికారుల ఆదేశాలు

**-సింగరేణి ఖాళీ స్థలాలపై రక్షణ కరువు**

**-కంచె వేయడంలో అధికారుల నిర్లక్ష్యం**



మందమర్రి, జూలై 2 (విజన్ ఆంధ్ర) : సింగరేణి సంస్థలో కింది స్థాయి ఉద్యోగులుగా పని చేస్తున్న ఎన్.సి.డబ్ల్యు.ఏ సెక్యూరిటీ సిబ్బందికి అధికారులు నుంచి ఒత్తిళ్లు ఇటీవల వ్యక్తమవుతున్నాయి. సింగరేణి ఖాళీ స్థలాలను రక్షించేందుకు కష్టపడి పని చేస్తున్న ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ గార్డ్ లకు అధికారులు జారీ చేసిన మౌకిక ఆదేశాలు ప్రస్తుతం వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళితే మందమర్రి మండల కేంద్రంలోని రామకృష్ణాపూర్ పట్టణ రాజీవ్ చౌక్ చౌరస్తా అనుకొని ఉన్న సింగరేణి ఖాళీ స్థలంలో బుధవారం రాత్రి డబ్బా టెలాను అక్రమంగా ఏర్పాటు చేయడంతో గురువారం ఆ ప్రాంతానికి సింగరేణి ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ గార్డ్ చేరుకొని ఎస్టేట్ అధికారులకు సమాచారాన్ని అందించారు. సింగరేణి సంస్థకు చెందిన స్థలం కావడంతో తక్షణమే ఏర్పాటు చేసిన డబ్బా టెలాను తొలగించాలని ఎస్టేట్ అధికారి ఆదేశాలు జారీ చేయడంతో మ్యాన్ పవర్ సహాయంతో తొలగించారు. కాగా తొలగించిన కాసేపటికి 'ఎవరైతే టెలాను వేశారో.. వాళ్ళకే తిరిగి అప్పగించండి' అంటూ సెక్యూరిటీ గార్డ్ కు అధికారి ఫోన్లో ఆదేశాలు ఇవ్వడంతో మరో చోట టెలాను దించారు. తొలగించమన్న అధికారులే అప్పగించాలని చెప్పిన తీరు కింది స్థాయి ఉద్యోగుల్లో తీవ్ర అవమానానికి గురి చేస్తుంది. విధుల్లో బాధ్యతాయుతంగా పని చేస్తున్న ఉద్యోగుల కష్టానికి.. అధికారులు ఆదేశాలు జారీ చేయడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలతో కింది స్థాయి ఉద్యోగులు బలి పశువులు అవుతున్నారన్న వాదనలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవంగా స్థలం సింగరేణిది,ఎస్ అండ్ పిసి సిబ్బంది బాధ్యత,రక్షణ అధికారులది,మరి కబ్జాలకు పాల్పడుతున్న వాళ్లపై సింగరేణి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అప్పగిస్తున్న తీరు అనేక అనుమానాలు దారి తీస్తున్నాయి.

**అదనపు పనులతో తీవ్ర ఇబ్బందులు..!**

**హామీలు అమలు చేయాలని డిమాండ్..!**

**రూ.18 వేల వేతనం, బకాయి భత్యాలు చెల్లించాలని ఉన్నికృష్ణన్, సునీత విజ్ఞప్తి..!**

**అదనపు విధులు తగ్గించి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి..!**



కాప్రా / జులై 02 (విజన్ ఆంధ్ర ప్రతినిధి)అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లపై ప్రభుత్వం అదనపు విధుల భారం మోపడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీ.ఐ.టీ.యూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి కె.ఉన్నికృష్ణన్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు జి.సునీత అన్నారు. అంగన్వాడీ సిబ్బందికి అప్పగించిన బీ.ఎల్.ఓ.విధులను తగ్గించి, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్, శిశు సంక్షేమ శాఖ అధికారి శారదకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలుగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు ప్రజాప్రతినిధులు, బీ.ఎల్.ఏ.లు, ప్రజల నుంచి తగిన సహకారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వలస వెళ్లిన ఓటర్ల వివరాల సేకరణ, ఫారాల పంపిణీ, సేకరణ, స్కానింగ్, ఆన్లైన్ నమోదు వంటి పనులతో ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, ప్రీ-స్కూల్ విద్య, చిన్నారుల పోషణ, గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తూనే మరోవైపు పల్స్ పోలియో, వివిధ శాఖల సర్వేలు, సమావేశాలు, నివేదికల తయారీ వంటి పనులు అప్పగించడం వల్ల కేంద్రాల నిర్వహణపై ప్రభావం పడుతోందన్నారు. కేవలం రూ.13 వేల గౌరవ వేతనంతో అన్ని శాఖల పనులు చేయించడం అన్యాయమని విమర్శించారు. అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డు, ఈఎస్ఐ, పీ.ఎఫ్. వంటి సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని, వేతనాలను సకాలంలో చెల్లించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని, మూడేళ్లుగా బకాయిపడ్డ బీఎల్వో భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయడంతో పాటు అంగన్వాడీ సిబ్బందిని ఐసీడీఎస్ సేవల నిర్వహణకే పరిమితం చేసి ఇతర శాఖల అదనపు విధులను తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి చిన్నారులకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ డాక్టర్లకు 'జీవన్ రక్షక్ అవార్డ్స్' ప్రధానం




హైదరాబాద్ జూలై 2026, విజన్ ఆంధ్ర (కెళ్ళ. విశ్వనాథ్) : 'డాక్టర్స్ డే' వేడుకలను పురస్కరించుకుని వివిధ రంగాలలో విశేషంగా సేవలు అందిస్తున్న ప్రఖ్యాత 'మేడిది సుబ్బయ్య ట్రస్ట్' ఆధ్వర్యంలో పీపుల్ మీడియా పాయింట్ నిర్వహణలో 'జీవన్ రక్షక్ అవార్డ్స్ - 2026' ప్రధానోత్సవ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. దేవుడికి ప్రతిరూపంగా భావించే డాక్టర్స్ లో మరింతగా సేవాభాన్ని పెంపొందించాలని, స్ఫూర్తిని వారిలో నింపుతూ ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. బుధవారంనాడు రవీంద్ర భారతి మెయిన్ హాల్, సైఫాబాద్ హైదరాబాద్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ హాస్పిటల్స్ లో పనిచేస్తున్న ప్రముఖ సీనియర్ డాక్టర్లు చేస్తున్న మహోన్నత సేవలను గుర్తించి ఎంపిక చేసి వారిని ఘనంగా 'మేడిది సుబ్బయ్య ట్రస్ట్' పక్షాన సత్కరించారు. ఈ ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు నవీన్ యాదవ్ హాస్య నటుడు బాబూ మోహన్ విచ్చేసి సీనియర్ డాక్టర్లకు 'జీవన్ రక్షక్ అవార్డ్స్' ప్రధానం చేసి ప్రశంశించి తమ అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వృత్తిని ఎంచు కున్నందుకు తమకు ఎంతో గర్వంగా ఉందని సీనియర్ డాక్టర్లు ఆశాభావం వ్యక్తం చేస్తూ పురస్కారాలను అందుకున్న వారిలో, చీఫ్ వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జరీ డాక్టర్. కె. సంజీవరావు 'చిరంజీవి హాస్పిటల్స్', డాక్టర్ శిల్పా పొన్నాడ కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కోస్మటాలజిస్ట్, హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్, చిరంజీవి హాస్పిటల్స్, డాక్టర్ సంకి దివ్య ఎంబీబీఎస్ డిడివిఎల్ డెర్మటాలజిస్ట్, డాక్టర్. అనూష రావు.జె సీనియర్ డాక్టర్ కిమ్స్ హాస్పిటల్స్ కొంపల్లి, డాక్టర్ దుర్గాప్రసాద్ కొల్లూరు ట్వింకిల్ చిల్డ్రన్స్ హాస్పిటల్, డాక్టర్ ఆనంద్ కరణం కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ సీఈఓ శ్రీ ఆనంద్ చైల్డ్ అండ్ న్యూరో సెంటర్, చందానగర్, డాక్టర్ బాల గణేష్ వేడాటి సర్జన్ ఫర్ యు మల్టీస్పెషాలిటీ క్లినిక్స్ హైదరాబాద్, డాక్టర్. అజయ్ కుమార్ పళగిరి కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్,డాక్టర్ పి. కల్పనా (బీహెచ్ఎంఎస్) పానెల్ డాక్టర్ ఎన్ఎఫ్సి, ఈసిఐఎల్,డాక్టర్. అనిత రెడ్డి, పెద్దపల్లి డిస్ట్రిక్ట్ సుల్తానాబాద్ మండల్ మెడికల్ ఆఫీసర్ ఇతర ప్రముఖ డాక్టర్స్ అతిథుల చేతుల మీదగా పురస్కారాలను అందుకున్నారు. ఈ పురస్కారాలను అందుకున్నందుకు తమకెంతో ఆనందంగా ఉందని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలనే తపనతో ముందుకు నడుస్తామని డాక్టర్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీస్ పెట్రోల్ బంక్‌లో ఉద్యోగాల భర్తీ

**బాయ్స్, గర్ల్స్‌కు ఉపాధి అవకాశం**

**ఆకర్షణీయమైన వేతనంతో వెంటనే నియామకాలు**

**జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



గద్వాల జూలై 02 (విజన్ ఆంధ్ర బ్యూరో)నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలోని పోలీస్ పెట్రోల్ బంక్‌లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న పోలీస్ పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు బాయ్స్, గర్ల్స్ కు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పెట్రోల్ బంక్ సిబ్బందిగా పనిచేయాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెంటనే సంప్రదించవచ్చు. ఎంపికైన వారికి నెలకు ఆకర్షణీయమైన వేతనం అందించబడుతుంది. క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేసే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని ఏ.ఆర్. హెడ్‌క్వార్టర్స్‌లో ఎమ్.టి. సెక్షన్ ఆర్.ఐ. వెంకటేష్ ని సంప్రదించాల్సిందిగా పేర్కొన్నారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 8712670281

## హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన 'లివ ,జీఎస్టీ' దినోత్సవం

హైదరాబాద్ జూలై 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్ ) :భారతదేశ అత్యంత కీలకమైన పరోక్ష పన్ను సంస్కరణల్లో ఒకటైన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా నేడు హైదరాబాద్‌లో 9వ జీఎస్టీ దినోత్సవం 2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, 2017 జూలై 1న ప్రారంభమైన జీఎస్టీ దేశ పరోక్ష పన్నుల వ్యవస్థను పూర్తిగా మార్చివేసిన ఒక మైలురాయి లాంటి సంస్కరణ అని అభివర్ణించారు. డిజిటలైజేషన్, ఏకరూపత, సహకార సమాఖ్య స్ఫూర్తి ద్వారా జీఎస్టీ దేశ పరోక్ష పన్నుల నిర్మాణాన్ని సరళతరం చేసిందని, పన్ను పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా మార్చిందని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత నిబంధనల అమలు పన్ను పరిపాలనను ఆధునీకరించినప్పటికీ, డిజిటల్ నోటీసులు, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటిసి), అప్పీళ్ల కాలపరిమితి వంటి అంశాల్లో సరికొత్త చట్టపరమైన, కార్యాచరణ సవాళ్లకు కూడా దారితీసిందని గౌరవ ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. నిరంతర అవగాహన, సామర్థ్య పెంపుదల కార్యక్రమాల ఆవశ్యకతను నొక్కిచెబుతూ.. మారుతున్న జీఎస్టీ వ్యవస్థను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పన్ను చెల్లింపుదారులు, చట్టపరమైన నిపుణులు, పన్ను అధికారులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. జీఎస్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడానికి పలు సూచనలు చేస్తూ, కాలపరిమితి ముగిసిన అప్పీళ్ల కోసం అమ్నెస్టీ అవకాశం, జీఎస్టీఎన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ వివాద పరిష్కార వ్యవస్థ, పన్ను అక్షరాస్యత కార్యక్రమాల నిర్వహణ వంటి చర్యలు వ్యాజ్యాలను తగ్గించి, స్వచ్ఛంద పన్ను చెల్లింపులను ప్రోత్సహిస్తాయని జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ప్రతిపాదించారు. పటిష్టమైన జీఎస్టీ వ్యవస్థను నిర్మించడంలో పన్ను చెల్లింపుదారులు, పన్ను నిపుణులు, పన్ను పరిపాలనా యంత్రాంగం కలిసికట్టుగా పనిచేయాలని, బలమైన, పారదర్శకమైన, స్వయంసమృద్ధ భారతదేశ నిర్మాణానికి నిజాయితీతో కూడిన పన్ను చెల్లింపులే అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జోన్ సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, గత తొమ్మిదేళ్లలో పన్ను నిబంధనల అమలును బలోపేతం చేయడం, డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రోత్సహించడం, సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరచడం ద్వారా జీఎస్టీ భారతదేశ పరోక్ష పన్నుల వ్యవస్థను మార్చివేసిందని పేర్కొన్నారు. జీఎస్టీ సాధించిన విజయాలను వివరిస్తూ, 2017లో ప్రారంభమైనప్పటి నుంచి నెలవారీ జీఎస్టీ వసూళ్లు రెండింతలు పైగా పెరిగాయని, నమోదిత పన్ను చెల్లింపుదారుల సంఖ్య దాదాపు 60 లక్షల నుంచి 1.65 కోట్లకు పైగా పెరిగిందని ఆయన గుర్తుచేశారు. పన్ను వసూళ్లలో గణనీయమైన వృద్ధి, పన్ను చెల్లింపుదారుల సంఖ్య భారీగా పెరగడంతో హైదరాబాద్ సీజీఎస్టీ జోన్ అద్భుతమైన పనితీరును కనబరిచిందని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పన్ను రీఫండ్‌ల వేగవంతమైన ప్రాసెసింగ్, సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ, జీఎస్టీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీల మధ్య మెరుగైన సమన్వయం వంటి పన్ను చెల్లింపుదారుల కేంద్రంగా చేపట్టిన పలు కార్యక్రమాలను అరుణ్ కుమార్ వివరించారు, అలాగే పన్ను వివాద పరిష్కారానికి తోడ్పడే జీఎస్టీ అప్పీలేట్ ట్రిబ్యునల్ అందుబాటులోకి రావడాన్ని ఆయన స్వాగతించారు. పన్ను చెల్లింపుదారుల అవగాహన, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాధాన్యతను నొక్కిచెబుతూ, భారతదేశ ఆర్థిక వృద్ధికి మద్దతు ఇచ్చే పారదర్శకమైన, సమర్థవంతమైన, సమగ్రమైన పన్ను వ్యవస్థను నిర్మించడానికి పన్ను చెల్లింపుదారులు, వ్యాపారాలు, పన్ను నిపుణులు, పన్ను అధికారుల మధ్య నిరంతర సహకారం అవసరమని ఆయన కోరారు. ప్రముఖ నటుడు డాక్టర్ కె. బ్రహ్మానందం ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయ్యారు. తాను ఎలాంటి లోటుపాట్లు, ఆలస్యం లేకుండా నిరంతరం జీఎస్టీ చెల్లిస్తున్నానని, నిజాయితీగా పన్ను చెల్లించడం దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరి ఉమ్మడి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) సీనియర్ అధికారులు, సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ విభాగాల అధికారులు, పన్ను రంగానికి చెందిన ప్రముఖులు, వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధులు,చట్టపరమైన నిపుణులు, ఇతర వాటాదారులు పాల్గొన్నారు




## కనువిందు చేసిన "నాట్యం" నృత్య వైభవం



హైదరాబాద్ జూన్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : ప్రముఖ కళాకార్ తెలుగు టీవీ సమర్పణలో "నాట్యం 2026" పేరుతో ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నృత్య వైభవం కార్యక్రమంలో వివిధ నృత్య అకాడమీల విద్యార్థులు పాల్గొని నేత్రపర్వంగా ప్రదర్శించిన నృత్యాంశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి, అలరించాయి. ఆదివారం సాయంత్రం "తెలంగాణ సారస్వత పరిషత్" వేదిక హైదరాబాద్ లో ప్రఖ్యాత 'సిరాజ్ డాన్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ' వ్యవస్థాపక అధ్యక్షుడు, సీఈఓ కళాకార్ తెలుగు టీవీ, ఏఐఈఎఫ్ స్టేట్ డైరెక్టర్ తెలంగాణ, ప్రముఖ ఈవెంట్స్ ఆర్గనైజర్, డాన్స్ కొరియోగ్రాఫర్, 'డాక్టర్. ఎస్.కె. సిరాజ్' నిర్వహించిన ఈ నృత్యోత్సవ వేడుకలలో చిన్నారులు వివిధ శాస్త్రీయ కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య రంగాలలో నృత్యంశాలను ప్రదర్శిస్తూ, అసాధారణ ప్రతిభతో అంకితభావంతో కనువిందు చేశారు. కళాకారులు కన్నుల పండుగగా ప్రదర్శించి ప్రేక్షకుల చప్పట్లను ప్రశంశలను అందుకున్నారు. చిన్నారుల విశేష ప్రతిభకు, సాధించిన విజయానికి గుర్తింపుగా కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన, డి ఎస్ గ్లామ్ మిసెస్ ఇండియా 2026 సాహితి దాస్యం, న్యాయవాది నేహ దేవకథే, హైకోర్టు న్యాయవాది హిమాయత్ హుస్సేన్, ధీ డాన్సర్ మల్లిక, చిన్నారులకు 'నాట్య ప్రతిభ' పురస్కారాలను ప్రదానం చేసి ప్రశంశా పత్రాలను అందజేసి శుభాభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అసాధారణ ప్రతిభ కనబరుస్తూ నృత్యాన్ని ప్రదర్శించి అలరించిన కుమారి. సిహెచ్ అద్వైత, కుమారి లాస్య బాసెట్టి లను, ఇతర నృత్యంశాలను ప్రదర్శించిన చిన్నారులను అలాగే, ఆంధ్ర నాట్యం కూచిపూడి నృత్యాలను చిన్నారులకు నేర్పిస్తూ, వారిని గొప్ప నాట్య కళాకారులుగా తీర్చిదిద్దుతున్న నటరాజ నృత్య నికేతన్, ఆర్మూర్ వ్యవస్థాపకురాలు నాట్య గురువు 'మృణాళిణి' ని ఇతర నాట్య గురువులను అభినందించి ఘనంగా సత్కరించారు. ప్రతిభ ఉన్న కళాకారులను గుర్తించి వారికి సరైన వేదికను కల్పించి ప్రోత్సహిస్తున్న కార్యక్రమం నిర్వాహకుడు డాక్టర్.ఎస్.కె. సిరాజ్ ను ఈ సందర్భంగా అతిథులు, నాట్య గురువులు, తల్లిదండ్రులు, ప్రేక్షకులు విశేషంగా అభినందించారు.

## 'సర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



మల్కాజిగిరి, జూలై 2,(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వం చేపట్టినస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వినాయక్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కోరారు. గురువారం వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని 167, 168, 169, 175, 243 బూత్‌లలో జరిగిన 'సర్' కార్యక్రమాన్ని ఆమె బీఎల్ ఓ, బీఎల్ ఏ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఫారాలు సకాలంలో అందేలా బూత్ లెవల్ ఆఫీసర్లకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీఎల్ ఓ తో కలిసి బీఎల్ ఏలు అందరూ సమన్వయంతో పని చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ ఓ సూపర్ వైజర్ సయ్యద్, బీఎల్ ఓలు హేమలత, తిరు మలదేవి, రాజేశ్వరి, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సాయిసురేష్, మల్లేష్ యాదవ్,శృకేష్, సోమనాథ్, వెంకటేశ, జగదీష్, గోపాల్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు

## ఏజెన్సీ అభివృద్ధికి రైతులు సహకరించండి

**- ఎమ్మార్వో అధికారులు**

కారేపల్లి,జూలై 2(విజన్ ఆంధ్ర)ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఈ ప్రాంత రైతులు ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మార్వో ఓరుగంటి వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి మండలంపాటిమీది గుంపు గ్రామ పంచాయతీలో గురువారం సీతారామ ప్రాజెక్టో భాగంగా ల్యాండ్ పూలింగ్ గురించి గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో అధికారులు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు సంబంధించి అటవీ శాఖ భూములు పోతున్న క్రమంలో ఫారెస్ట్ భూములకు ఎవరైనా రైతులు ఆర్ ఓ ఆర్ పట్టాలు కలిగి ఉన్నారా,ఇతర వివరాలను తెలియ చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 200 ఎకరాల అటవీ భూమి పోతుందని పోడు సాగుదారుల వద్ద ఆర్ ఓ ఆర్ పట్టాలంటే వివరాలు తెలపాలన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఫీల్డ్ సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బానోత్ పద్మావతి,ఇరిగేషన్ డి.వెంకట్ నాయక్,ఎఫ్ ఆర్ వో గ్రామ ప్రజలు,రైతులు,పెద్దలు ,గ్రామ పంచాయతీ లైన్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జోగులాంబ ఆలయంలో శ్రీచక్ర యంత్ర ప్రాణ ప్రతిష్ఠ

## సమస్యలపై స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



నిర్మల్ జిల్లా,జూలై 02,(విజన్ ఆంధ్ర);వార్డ్ నెం. 13 కాంగ్రెస్ నాయకులు సిరికొండ శ్రీనివాస్ మరియు కాలనీ వాసులు మర్యాదపూర్వకంగా కలిసి, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రవినగర్ రోడ్ నెం. 4లో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరి బురద పేరుకుపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరగా, వైస్ చైర్మన్ గారు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### శృంగేరి పీఠాధిపతి చేతుల మీదుగా ఘనంగా నిర్వహణ
### భక్తులకు ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి ప్రసాదించే యంత్రరాజం

అలంపూర్ జూలై 02(విజన్ ఆంధ్ర బ్యూరో)దేశంలోని ప్రముఖ శక్తిపీఠాలలో ఒకటైన అలంపూర్ శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం మరో విశిష్ట ఘట్టానికి వేదికైంది. దేవీశక్తి స్వరూపంగా భావించే శ్రీచక్ర యంత్ర ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వంద మందికి పైగా వేదపండితుల వేదఘోషల నడుమ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల మేరకు జోగులాంబ అమ్మవారి ఆలయంలో శ్రీచక్ర యంత్రాన్ని ప్రతిష్ఠించేందుకు ఎపిటోమ్ ప్రాజెక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి శృంగేరి శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం స్వామీజీ జోగులాంబ ఆలయానికి విచ్చేయగా, దేవస్థానం ఈఓ దీప్తి, వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం



పలికారు. అనంతరం ఆలయ అధికారులు, వేదపండితులు, ఎపిటోమ్ ప్రాజెక్ట్స్ ఎండీ జైపాల్ కాంత ఆధ్వర్యంలో శ్రీచక్ర యంత్రాన్ని అమ్మవారి గర్భగుడిలోకి చేర్చారు. గురువారం తెల్లవారుజాము నుంచి ప్రతిష్ఠాంగ పూజలు, హోమాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సింహలగ్న సుముహూర్తంలో ఉదయం 10 గంటలకు శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం స్వామీజీ చేతుల మీదుగా తెలంగాణ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థానం ఈఓ దీప్తి, ఎపిటోమ్ సంస్థ ఎండీ జైపాల్ కాంత, శ్రీవిద్య దంపతులు, వేదపండితుల సమక్షంలో శ్రీచక్ర యంత్రానికి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, దేశంలోని అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారి ఆలయంలో శ్రీచక్ర ప్రతిష్ఠ జరగడం భక్తుల అదృష్టమన్నారు. దీనివల్ల ఆలయంలో ఆధ్యాత్మిక శక్తి, దైవ చైతన్యం మరింత పెరగడంతో పాటు భక్తులకు ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యం లభిస్తాయని తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, శ్రీచక్రారాధన ద్వారా మనోనిగ్రహం, ఏకాగ్రత, ఆత్మీయ ప్రశాంతత కలుగుతాయని పేర్కొన్నారు. జోగులాంబ ఆలయంలో శ్రీచక్ర ప్రతిష్ఠకు సహకరించే అవకాశం కల్పించినందుకు తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ శాఖకు ఎపిటోమ్ ప్రాజెక్ట్స్ ఎండీ దంపతులు జైపాల్ కాంత, శ్రీవిద్య లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవ తన పూర్వజన్మ సుకృత ఫలమని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. శాక్తేయ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన యంత్రంగా భావించే శ్రీచక్రాన్ని యంత్రరాజం గా పిలుస్తారు. శ్రీలలితా త్రిపురసుందరి దేవి సూక్ష్మ స్వరూపంగా పరిగణించే ఈ యంత్ర ప్రతిష్ఠ వల్ల ఆలయంలో సానుకూల ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తులకు శుభఫలితాలు కలుగుతాయని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ కార్యక్రమంలో దేవాదయ శాఖ స్థపతి వల్లి నాయగం, ధార్మిక అడ్వైజర్ గోవింద హరి పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్ జూలై 02 :( విజన్ ఆంధ్ర) రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు పాములు, విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉన్న గుంతలలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది అటెండెన్స్ వివరాలను అడిగి తెలుసుకుని, మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. నాసిరకం బియ్యం, సరుకులు సరఫరా చేస్తే వెంటనే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఆర్.ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, మరమ్మత్తులు చేయించాలని అన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, తాను వారం రోజుల తర్వాత మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, ఆలోగా అన్ని లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని సూచించారు. అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి, విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని బాలికలకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలికలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఈగలు వృద్ధి చెందకుండా వంటగది, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శ్రవణ్, ఎంపీడీఓ కమలాకర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్యామల తదితరులు ఉన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



నిజామాబాద్ జులై02:( విజన్ ఆంధ్ర ) వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో గత రెండు రోజులుగా వర్షాలు ప్రారంభమయ్యాయని, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రధానంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్ర పరచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులతో పాటు సంబంధిత విభాగాధిపతులు సిబ్బందితో సమాచారం తెలుసుకుంటూ ముందుకెళ్లాలని చెప్పారు. నాలాలు సరిగా లేనిచోట ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అధిక వర్షపాతం నమోదైనప్పుడు నాలాలు వెంటనే శుభ్రం చేయాలన్నారు. నీరు నిండిన చోట తోడేందుకు భారీ మోటార్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అవసరమైతే ప్రత్యేక బృందాన్ని సిద్ధంగా ఉంచాలన్నారు.

## జిల్లాలో ౯౦.౯౯ శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి

### -జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్

గద్వాల జూలై 02(విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 90.99 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు పూర్తి,సరైన వివరాలతో నింపి సంబంధిత బీఎల్వోలకు తిరిగి అందించేలా ప్రజలను చైతన్యపరచాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి,ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని కోరారు.



జూన్ 25వ తేదీ నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి,సెప్టెంబర్ 28 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి,వాటి పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఓటు నమోదు!!

### ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి
### ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి
### ఎన్నికల సవరణపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సందేశం



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 2 (విజన్ ఆంధ్ర)భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో విజయవంతంగా పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖనిలోని ఎన్టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్లో బీఎల్వోలు, బీఎల్ఏలు, కార్పొరేటర్లు, ఎన్నికల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తి పేరు తప్పకుండా నమోదు కావాలని, అర్హత లేని వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. బీఎల్వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యం, పొరపాట్లు చోటుచేసుకోకుండా ప్రతి వివరాన్ని ధృవీకరించాలని సూచించారు. ప్రజలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించి వారి సహకారంతో ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, దాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఇంచార్జ్ కమిషనర్ అరుణ శ్రీ, ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్వోలు, బీఎల్ఏలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా ఉత్పత్తిసరఫరాలో ఆర్ఎఫ్సీఎల్ మరో మైలురాయి!!

### జూన్ నెలలో ఐదు రాష్ట్రాలకు 97 వేల మెట్రిక్ టన్నులకుపైగా పంపిణీ
### ఉత్పత్తి, సరఫరా లక్ష్యాల సాధనపై ఉద్యోగులను అభినందించిన యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 2 (విజన్ ఆంధ్ర)రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) జూన్ నెలకు సంబంధించిన యూరియా ఉత్పత్తి, సరఫరా వివరాలను యూనిట్ హెడ్ ఎస్.కె. జిందాల్ గురువారం విడుదల చేశారు. జూన్ నెలలో ప్లాంట్ 94,849 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేయగా, మొత్తం 97,094.70 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించింది. ఇందులో తెలంగాణకు 48,675.33 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 11,308.23 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 28,338.66 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 5,655.60 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 3,116.88 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు అని ప్రకటనలో తెలిపారు. రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా సమయానికి ఎరువులను అందించడంలో ఆర్ఎఫ్సీఎల్ మరోసారి తన సామర్థ్యాన్ని చాటిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.కె. జిందాల్ ఉత్పత్తి, సరఫరా లక్ష్యాల సాధనలో కృషి చేసిన ఉద్యోగులు, కార్మికులు, అధికారులను అభినందించారు అని తెలిపారు. సంస్థ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖతో పాటు తెలంగాణ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులకు నాణ్యమైన యూరియాను నిరంతరాయంగా అందిస్తూ వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో కొత్త మార్పులు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
### 125 రోజుల పనిదినాలతో గ్రామాభివృద్ధి, రైతులకు అధిక ప్రోత్సాహం
### పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె లో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి »»VB`G RAM (గ్రామీణ్)“ పథకం పనుల ప్రారంభం
### ప్రతి పేద కుటుంబానికి మరింత మేలు : ఎమ్మెల్యే

పెండ్లి మర్రి, జూలై 2 (విజన్ ఆంధ్ర)గ్రామీణ పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్పులు ప్రతి పేద కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “ఎదీ–+ =ూవీ (గ్రామీణ్) “వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్“ కార్యక్రమాన్ని గురువారం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా ఒబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలు ప్రారంభించగా వై ఎస్ ఆర్ కడప జిల్లాలో కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లెలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరద కాలువలో పూడికతీత పనులను పార, పలుగు పట్టి ప్రారంభించారు. అనంతరం ఉపాధిహామీ పనుల ద్వారా తిప్పిరెడ్డిపల్లెలో నిర్మించిన నూతన క్యాటిల్ షెడ్ ను వారు ప్రారంభించి. స్థానిక రైతుకు చెందిన ఎద్దులకు




అందులో వసతి కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఉపాధి హామీ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చడం లో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇప్పుడు తీసుకొచ్చిన నూతన మార్పులతో గ్రామీణ కుటుంబాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. గతంలో 100 రోజులుగా ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచడం ద్వారా ప్రతి కుటుంబానికి అదనంగా సుమారు రూ. 10 వేల వరకు ఆదాయం లభించే అవకాశం ఏర్పడిందన్నారు. ఉపాధి కల్పనతో పాటు గ్రామాల్లో రహదారులు,అంగన్‌వాడీ కేంద్రాలు,కమ్యూనిటీ భవనాలు వంటి మౌలిక సదుపాయాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు తోటల పెంపకం వంటి వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలకు 100 శాతం సబ్సిడీ అందిస్తామని, మొక్కల నాటకం నుంచి మూడేళ్ల పాటు వాటి సంరక్షణకు అవసరమైన నీరు, ఎరువుల వ్యయాన్ని కూడా ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించారు. పథకం అమలులో పారదర్శకత కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, హాజరు నమోదు నుంచి పనుల పర్యవేక్షణ వరకు టెక్నాలజీ ద్వారా నిర్వహించి అక్రమాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి గ్రామంలో అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా పనుల ప్రణాళికలు రూపొందించుకుని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి పేద కుటుంబానికి మరింత మేలు : ఎమ్మెల్యేకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న ఈ పథకం. గ్రామాల్లో ప్రతి పేద కుటుంబానికి ఆర్థికంగా మరింత మేలు చేకూరుస్తోందని. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కమలాపురం నియోజక వర్గంలో సమర్థవంతంగా అమలు చేయడం వల్ల గత రెండేళ్లలో సుమారు రూ. 120 కోట్ల మేర పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో రూ. 18 కోట్ల వరకు మాత్రమే నిధులు లభించగా, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఈ ఏడాది సుమారు రూ. 42 కోట్ల నిధులు నియోజకవర్గానికి కేటాయించగలిగారని తెలిపారు. రైతులు, ఉపాధి కూలీలు ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, గోశాలలు,తోటల పెంపకం, సోక్‌పిట్లు, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారులు, నీటి సంరక్షణ పనులు, చిన్న గిడ్డంగులు,గ్రామీణ మార్కెట్లు,నిర్వహణ పనులు వంటి అనేక కొత్త అవకాశాలు ఈ పథకం లో కల్పించ బడినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని,ప్రతి గ్రామంలో సీసీ రహదారులు, డ్రైనేజీలు, వ్యవసాయ రహదారులు, ప్రజా సౌకర్యాల కల్పన లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో కమలాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడి అదిశేషారెడ్డి, ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర, పశుసంవర్ధక శాఖ, పీఆర్,ఇరిగేషన్,ఎపిఎంఐపి, అనుబంధ శాఖల అధికారులు,మహిళలు, రైతులు,స్థానిక నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి!!

### ప్రతిరోజు ఎక్స్‌రే నివేదికను కలెక్టరేట్‌కు సమర్పించాలి
### మాన్యువల్ విధానంలోకి లిఫ్ట్ ఆపరేషన్.. భద్రతకు ఫస్ట్ ప్రిఫరెన్స్ ల్యాబ్ పరికరాలు, కంప్యూటర్ల కొనుగోలుకు టీఎస్ఎంఎస్ఐడీసీకి ఆదేశాలు
### బడ్జెట్ ఆమోదం.. త్వరలోనే కొత్త ల్యాబ్ పరికరాలు, యూపీఎస్‌ల ఏర్పాటు
### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 2 (విజన్ ఆంధ్ర)గురువారం రామగుండం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను గట్టిగా ఆదేశించారు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష. ఈ సందర్శనలో భాగంగా క్రిటికల్ కేర్ సెంటర్, వివిధ వార్డులు, ఐపీ విభాగం, ల్యాబ్‌లు, ఎక్స్‌రే రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, నిత్యం జరిగే ఎక్స్‌రే పరీక్షల నివేదికలను ప్రతిరోజూ కలెక్టరేట్‌కు పంపాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు, మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి తక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న లిఫ్ట్‌ను మాన్యువల్ ఆపరేషన్ విధానంలోకి మార్చాలని, అలాగే భద్రతా ప్రమాణాలతో కూడిన కొత్త లిఫ్ట్‌ను, ఆరు రక్షణ గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని



తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎస్ఐడీసీ) అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ఆసుపత్రికి అవసరమైన రెండు ఫ్యూమిగేటర్లు, రెండు కంప్యూటర్లు, రెండు రిఫ్రిజిరేటర్లు, ల్యాబ్ కోసం ఐదు యూపీఎస్‌లు, ఒక ప్రింటర్‌ను తక్షణమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించిన ఈ తనిఖీ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు, ఆర్ఎంఓ కృపా బాయి, పలువురు వైద్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో ఒకటికి మించి ఓట్లు కలిగి ఉండటం చట్టరీత్యా నేరం

## జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి



నిజామాబాద్, జూలై 02 :(విజన్ ఆంధ్ర) ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 లోని నిబంధనల ప్రకారం, ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటం, తప్పుడు సమాచారం ఇవ్వడం శిక్షార్హమైన నేరాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు ఈ చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం ఏ వ్యక్తి కూడా ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో తన పేరును నమోదు చేసుకోవడానికి చట్టపరంగా అర్హుడు కాదని స్పష్టం చేశారు. సెక్షన్ 18 ప్రకారం ఏ వ్యక్తి కూడా ఏ ఒక్క నియోజకవర్గంలోనైనా ఒకసారి కంటే ఎక్కువ ఓటరుగా నమోదు చేసుకోకూడదని సూచించారు. సెక్షన్ 31 ప్రకారం ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల నమోదు లేదా తొలగింపుల సమయంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, లిఖితపూర్వక డిక్లరేషన్‌ను సమర్పిస్తే, అది తీవ్రమైన నేరంగా పరిగణించ బడుతుందని అన్నారు. అటువంటి వారికి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, లేదా జరిమానా, లేదా ఈ రెండూ విధించబడతాయని తెలిపారు. ఓటర్లందరూ ఈ చట్టపరమైన నిబంధనలను విధిగా పాటించాలని, ఎవరికైనా ఒకటి కంటే ఎక్కువ ఓట్లు లేదా వేర్వేరు ప్రాంతాలలో ఓట్లు ఉన్నట్లయితే, వెంటనే ఫారమ్-7 (ఖీశీతీఎ-7) ద్వారా అదనపు ఓట్లను తొలగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

# శ్రీరంగనాయక స్వామివారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



శ్రీరంగాపురం జులై 02 (విజన్ ఆంధ్ర ):తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని ప్రసిద్ధ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాయక స్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ మొక్కలను అందజేసి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఘన స్వాగతం పలికారు. ఆలయ అధికారులు, సిబ్బంది మంగళవాయిద్యాల నడుమ సాంప్రదాయబద్ధంగా ఆలయంలోకి ఆహ్వానించారు. ఆలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలతో ప్రత్యేక ఆశీర్వాదం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. తదనంతరం ఆలయ పరిసరాలను సందర్శించి అక్కడి సహజ సౌందర్యాన్ని వీక్షించారు. ఆలయంలోని మ్యూజియంను సందర్శించి అక్కడ ప్రదర్శించిన చారిత్రక చిత్రాలు, కళాఖండాలను ఆసక్తిగా పరిశీలించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, స్థానిక సర్పంచ్ మద్దిలేటి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ లో సీఐఐ సదస్సు

విశాఖపట్టణం, జూలై 2ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త పంథాను ఎంచుకుంది. వచ్చే నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సన్నాహక సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఈ సదస్సును గతానికి భిన్నంగా, వినూత్నంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈసారి భాగస్వామ్య సదస్సు కేవలం విశాఖపట్నానికే పరిమితం కాకుండా.. రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలైన విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఎంఓయూలు , పెట్టుబడుల సంతకాలే ధ్యేయం కాకుండా.. అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని పంచుకోవడం మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు.

# పుస్తక జ్ఞానానికి సామాజిక కోణాన్ని జోడించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

## సోన్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్

నిర్మల్ జిల్లా,జూలై 02,(విజన్ ఆంధ్ర);కేవలం పుస్తకాల్లోని పాఠాలను నేర్చుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సమాజంలో జరుగుతున్న పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ విద్యను అభ్యసించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విద్యార్థులకు సూచించారు. గురువారం సోన్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా బోధన, వసతి, ఆహారం, పరిశుభ్రత వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా పాఠశాలలోని తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. అనంతరం వంటశాల, సరుకుల నిల్వ గది, భోజనశాలను తనిఖీ చేసి



అక్కడి పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు. మెస్ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నాణ్యమైన కూరగాయలు, ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని, వంటశాలలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు, స్టాక్ రిజిస్టర్‌ను క్రమం తప్పకుండా నవీకరించాలని సూచించారు. అనంతరం పదో తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారి జవాబు పత్రాలను పరిశీలించి, గణితం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. కొంతమంది విద్యార్థులను బోర్డుపై లెక్కలు చేయించి, సమస్యల పరిష్కార విధానాన్ని వివరింపజేశారు. శాస్త్రవేత్తల కృషి, విజ్ఞాన శాస్త్రం సమాజ అభివృద్ధిలో పోషిస్తున్న పాత్ర గురించి వివరించి, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమకాలీన సామాజిక, శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నలు అడిగే అలవాటు పెంపొందించుకోవాలని, ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడం, పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని కలెక్టర్ సూచించారు. సృజనాత్మకత, ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, వసతి, భోజన సదుపాయాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ప్రత్యేక అధికారి సుధాకర్, తహసీల్దార్ సంతోష్, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

## ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) జూలై 02 గురువారం : నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ (ఖూా) కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలోని కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని, వారు ఇచ్చే ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి, పారదర్శక విచారణ ద్వారా సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. డయల్ 112 ద్వారా వచ్చే కాల్స్ పై త్వరితగతిన స్పందిస్తూ, బాధితులకు సకాలంలో సహాయం అందించాలని బ్లూ కోర్ట్ సిబ్బందికి సూచించారు. అలాగే స్థానిక రౌడీషీటర్ల వివరాలను అడిగి తెలుసుకొని వారి కదలికలపై నిరంతర నిఘా మరియు పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో విధులు నిర్వర్తించే విలేజ్ పోలీస్ ఆఫీసర్లు తమ పరిధిలోని గ్రామాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, సైబర్ క్రైమ్ వారియర్, సీసీటీవీ ఇంచార్జ్ మరియు ఇతర సిబ్బంది పనితీరును సమీక్షించి వారి విధులకు సంబంధించిన పలు సూచనలు చేశారు. స్టేషన్‌లో



పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటూ, ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సై కురుమూర్తిని ఆదేశించారు. ఈ తనిఖీలో పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది కనబరిచిన క్రమశిక్షణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు వ్యవస్థ మరింత బలోపేతంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆకాంక్షించారు.

# విదేశీ ఉద్యోగ మేళాకు విశేష స్పందన

## వేలాదిగా తరలివచ్చిన యువత లాంఛనంగా ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే పాల్గొన్న ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్, కలెక్టర్, మేయర్

నిజామాబాద్, జూలై 02 :( విజన్ ఆంధ్ర) జిల్లా శిక్షణ ఉపాది కల్పన శాఖ ఆధ్వర్యంలో టామ్ కామ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగ మేళా, జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. గురువారం స్థానిక వర్ని చౌరస్తా సమీపంలోని జనార్దన్ గార్డెన్ లో నిర్వహించిన జాబ్ మేళాకు ఐదు వేల పైచిలుకు మంది యువత తరలివచ్చారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు జాబ్ మేళాను సందర్శించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా అనేక కార్యక్రమాలను చేపడుతోందని, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని



అన్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విదేశాల్లో ఉద్యోగాలు చేయడానికి ఎలాంటి భయాందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రవాస భారతీయుల సంక్షేమానికి పెద్దపేట వేస్తుందన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొత్త పాలసీ రూపొందించనుందని తెలిపారు. కాగా, నిజామాబాద్ లో ఇంత పెద్ద స్థాయిలో విదేశీ జాబ్ మేళా నిర్వహించడం ప్రశంసనీయమని నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాది కల్పన శాఖ అధికారి వేల్పుల విజేత, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నిరుద్యోగ యువతీ, యువకులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డి, చెవిరెడ్డిలతో నెగ్గేదెలా

తిరుపతి,జూలై 2వైసీపీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ బలం పుంజుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ల మధ్య పెద్ద వైరం నడుస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు టాక్ నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డి ఆ ఇద్దరు నేతల విషయంలో ఎటు తేల్చుకోలేకపోతున్నట్లు తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు అంటేనే ముందుగా గుర్తొచ్చేది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి ఎన్నికల్లో ఆ జిల్లా నుంచి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు గెలిచారు. అదే సమయంలో రోజాతో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లాంటి వారు ఓడిపోయారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి మాట నడిచేది చిత్తూరు జిల్లాలో. రాయలసీమలో సైతం ఆయన హవా ఉండేది. అటువంటిది ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత.. పెద్దిరెడ్డి కి వ్యతిరేకంగా చెవిరెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారంలో ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి హవా అంతా ఇంతా కాదు. ఏకంగా కుప్పంలో చంద్రబాబును, హిందూపురంలో బాలకృష్ణను ఓడించేందుకు ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. అదే సమయంలో సొంత పార్టీ వారు సైతం ఆయన కనుసన్నల్లో ఉండాల్సిందే. లేకుంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పేవి కావు. అందుకే అప్పట్లో ఆర్కే రోజాతో పాటు చెవిరెడ్డి లాంటివారు పెద్దిరెడ్డి విషయంలో చాలా గౌరవభావంతో ఉండేవారు. దానికి ప్రధాన కారణం భయం. అయితే ఇప్పుడు వైసీపీ ఓడిపోయిన తర్వాత పెద్దిరెడ్డి విషయంలో వైసీపీ నేతల తీరు మారింది.ప్రధానంగా ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్రంగా విభేదిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి రాయలసీమను చూసేవారు. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి వెంట నిత్యం తాడేపల్లి కార్యాలయంలోనే ఉండేవారు. కానీ ఇప్పుడు మద్యం కుంభకోణం కేసు పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి విషయంలో పెద్దిరెడ్డి వైఖరి మారినట్లు ప్రచారంలో ఉంది. అదే సమయంలో తాడేపల్లి లో చేరారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. పెద్దిరెడ్డి ఫ్యామిలీ విషయంలో జగన్ చెవిరెడ్డి ఇస్తున్న సమాచారాన్ని నమ్ముతున్నారని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం సాగుతోంది. దీంతో ఆ ఇద్దరు నేతల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయని.. ఆ ఇద్దరు నేతలను సర్ది చెప్పలేక జగన్మోహన్ రెడ్డి బాధపడుతున్నట్లు ప్రచారంలో ఉంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# నిబంధనలు కాగితాలకే పరిమితమా?

## టేకులపల్లి మండలంలోని ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ కరువు స్కూల్లు ప్రారంభమై రోజులు గడుస్తున్నా తనిఖీలు కనిపించవు మౌలిక సదుపాయాలు, భద్రత, గుర్తింపు నిబంధనల అమలుపై తల్లిదండ్రుల ప్రశ్నలు




టేకులపల్లి జులై 02 విజన్ ఆంధ్ర కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ టేకులపల్లి మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖ పర్యవేక్షణ తగిన స్థాయిలో కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానిర్వహించబడుతున్నాయా? విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, అగ్నిమాపక భద్రత, భవనాల భద్రత, ఆటస్థలం, తగిన తరగతి గదులు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, గుర్తింపు పత్రాల చెల్లుబాటు వంటి అంశాలను ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో సంబంధిత అధికారులు పరిశీలించడం అవసరమని విద్యా నిబంధనలు సూచిస్తున్నాయి.అయితే మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఇటువంటి తనిఖీలు జరిగాయా? లోపాలు గుర్తించిన పక్షంలో యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి సరిదిద్దే చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కనీస ప్రమాణాలు పాటించని విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకుంటున్నారా లేదా అనే సందేహాలు కూడా తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి.విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య మరియు ప్రభుత్వ నిబంధనల సమర్థ అమలును దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అవసరమైతే లోపాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# శంకుస్థాపనలతో సరా19 ఏళ్లలో మూడోసారి

కడప, జూలై 2 వైఎస్సార్ కడప జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. జూలై 3న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, 2007 నుంచి ఇప్పటివరకు వరుసగా వచ్చిన ముఖ్యమంత్రులంతా శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేస్తూనే ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై రాయలసీమ వాసుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి వేయబోయే పునాది రాయి అయినా ప్రాజెక్టు పూర్తికి దారితీస్తుందా.. లేక గత చరిత్ర పునరావృతమవుతుందా? అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. కానీ, విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా.. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలతో పాటు కడప స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం ఇచ్చిన మాటను పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం చేతులెత్తేయడంతో, రాష్ట్ర ప్రభుత్వమే ఈ భారీ ప్రాజెక్టును మోయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతోంది.కడప స్టీల్ ప్లాంట్ చరిత్రను గమనిస్తే.. ఇదొక శంకుస్థాపనల రికార్డుగా నిలిచిపోతుంది. 2007లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జమ్మలమడుగు వద్ద మొదటిసారి శంకుస్థాపన చేశారు. అది ముందుకు సాగలేదు. విభజన తర్వాత 2018లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సున్నిపెంట వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిన వెంటనే 2019 డిసెంబర్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్‌కు మూడోసారి పునాది రాయి వేశారు.ఆయా కంపెనీల బోర్డులు మారడం, శంకుస్థాపనల శిలాఫలకాలు పడటమే తప్ప ప్రాజెక్టు మాత్రం అంగుళం కూడా ముందుకు కదల్లేదు. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ప్రతిపక్షాలు మరియు ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాష్ట్రంలోకి వచ్చే ప్రైవేట్ స్టీల్ ప్రాజెక్టులకు మరియు ఇతర పారిశ్రామిక దిగ్గజాలకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు, విద్యుత్, నీటి రాయితీలను గుమ్మరిస్తున్న పాలకులు.. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన కడప స్టీల్ ప్లాంట్‌కు మాత్రం నిధులు కేటాయించడంలో వెనుకాడుతున్నారనే చర్చ నడుస్తోంది.

# రెండు రాష్ట్రాల మధ్య చెత్త పంచాయితీ

అదిలాబాద్, జూలై 2,తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర మధ్య మరోసారి చెత్త పంచాయతీ తెరపైకి వచ్చింది. దీంతో ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీదర్ మున్సిపాలిటీ చెత్తను తీసుకొచ్చి తమ గ్రామంలో వేస్తుండటంపై.. మల్గి గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బీదర్ నుంచి చెత్తతో వచ్చిన మున్సిపాలిటీ వాహనాలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ తీవ్ర గందరగోళం నెలకొంది.తెలంగాణ కర్ణాటక సరిహద్దులో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కర్ణాటకలోని బీదర్ మున్సిపాలిటీ చెత్తను.. తెలంగాణలోని మల్గి గ్రామం సమీపంలో డంప్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు చేపట్టిన నిరసన బుధవారం తీవ్ర రూపం దాల్చింది. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉదయం నుంచే ఉద్రిక్త వాతావరణం నెలకొనగా.. ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు గంటల పాటు నిలిచిపోయాయి. చెత్త వాహనాలను గ్రామస్తులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన అధికారులు ప్రధాన రహదారిపైనే చెత్త పారబోసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బీదర్-మల్గి మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇరు రాష్ట్రాల పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామస్తులు ఆందోళన కొనసాగిస్తున్నారు. కొన్ని రోజులుగా బీదర్ మున్సిపాలిటీకి చెందిన వ్యర్థాలను తెలంగాణ సరిహద్దులోని మల్గి గ్రామ శివారులో పారబోస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ చెత్త కారణంగా కాలుష్యం పెరిగి.. దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని వారు పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని చెబుతున్నారు.చెత్తతో వచ్చిన మున్సిపల్ వాహనాలను బుధవారం రోజున మల్గి గ్రామస్తులు అడ్డుకోవడంతో ఈ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. గ్రామస్తులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీదర్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది.. మల్గి-బీదర్ ప్రధాన రహదారిపైనే చెత్తను పారబోసినట్లు స్థానికులు ఆరోపించారు.



# మట్టి జ్ఞాపకమే జానపదం

- జానపద కళల పరిరక్షణే జాతి గౌరవం
- అంతరించి పోతున్న జానపద కళలకు జీవం పోయాలి

రచన: తరాల శివచరణ్ నాయుడు

విజన్ ఆంధ్ర(02)హైదరాబాద్

కాలం ఒక నది...
దాని ప్రవాహంలో
రాజ్యాలు కొట్టుకుపోయాయి,
రాజులు మరుగున పడ్డారు,
రాతి శాసనాలు శిథిలాలయ్యాయి.
కానీ ఒక రైతు పెదవిపై పుట్టిన పాట ఇంకా బతికే ఉంది,
ఒక డప్పు చర్మంపై పడ్డ దెబ్బ
ఇంకా చరిత్ర గుండెను తడుముతోంది.
ఒక అవ్వ చెప్పిన కథ
ఇంకా వెన్నెల రాత్రుల గాలిలో వినిపిస్తోంది అదే జానపదం,
అది అక్షరాల్లో బందీ కాని సాహిత్యం.
అది మట్టిలో మొలిచిన వేదం.
అది చెమటను చందస్సుగా మార్చుకున్న కవిత్వం,
అది ఆకలిని కూడా గీతంగా ఆలపించిన ప్రజల ఆత్మ,
పల్లె అంటే కొన్ని ఇళ్లు కాదు ఒక జీవన తత్వం,
ఒక మట్టి తల్లి ఒక సంస్కృతి ఆలయం.
అక్కడ ఎద్దుల అడుగులు లయ నేర్పుతాయి.
నాగలి గీతలు పద్యాలు రాస్తాయి.
చెరువు అలలు రాగాలు పాడుతాయి,
పంట పొలాలు పచ్చని కవితలవుతాయి,
డప్పు మోగితే అది శబ్దం కాదు,
భూమి గుండె కొట్టుకున్న స్పందన,
ఒగ్గుకథ మొదలైతే అది కథ కాదు,
తరాల రక్తంలో వెలిగే జ్ఞాపకాల జ్యోతి,
బుర్రకథ పలికితే అది వినోదం కాదు,
ప్రశ్నించడం నేర్పిన ప్రజా తత్వం,
బతుకమ్మ విరిసితే అది పూల సమూహం కాదు,
స్త్రీ హృదయం భూమిని ఆలింగనం చేసుకున్న పండుగ,
కాని కాలం ఇప్పుడు వేరే పాట పాడుతోంది,
చేతిలో చరవాణి ఉంది మనసులో మట్టి లేదు,
చెవిలో శబ్దం ఉంది గుండెలో డప్పు లేదు,
వేలి స్పర్శకు ప్రపంచం చేరువైంది,
కానీ పక్కింటి మనిషి దూరమయ్యాడు,
జానపద కళాకారుడి గొంతు
నెమ్మదిగా నిశ్శబ్దమవుతోంది,
అతని కళ మ్యూజియంలో పెట్టే వస్తువు కాదు,
అది మన ఉనికిని నిలబెట్టిన ఊపిరి,
ఒక జాతి తన జానపదాన్ని మరచిపోతే,
ముందుగా తన భాషను కోల్పోతుంది,
తర్వాత తన సంస్కృతిని
చివరికి తన ఆత్మను,
అందుకే....
పిల్లలకు పల్లె గీతాలు నేర్పండి,
పాఠశాలల్లో జానపద కళలకు చోటివ్వండి,
కళాకారుడి చేతిలోని డప్పును గౌరవించండి,
అది ఒక వాద్యం కాదు ఒక నాగరికత గుండె చప్పుడు,
మట్టి వాసనను పుస్తకాలలో కాదు,
మనసుల్లో దాచుకుందాం.
పల్లెను జ్ఞాపకంగా కాదు జీవితంగా మలుచుకుందాం,
ఎందుకంటే...
మనిషి పుట్టింది మట్టిలోనే సంస్కృతి పుట్టింది పల్లెలోనే,
జానపదం పుట్టింది ప్రజల గుండెల్లోనే,
అది నిలిస్తేనే భాష నిలుస్తుంది,
భాష నిలిస్తేనే జాతి నిలుస్తుంది,
అందుకే....
పల్లె జీవన ప్రతిఫలమే జానపదం.
జానపద కళలే జాతి ఆత్మ,
జనపదమే మన జ్ఞాపకం...
జనపదమే మన భవిష్యత్తు...
జనపదమే మన శాశ్వత శ్వాస

# నిజాంపేట్ అభివృద్ధిపై ఎమ్మెల్యే కె.పి. వివేకానంద సమగ్ర సమీక్ష

- -చెరువుల అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుద్ధ్యంపై అధికారులకు కీలక ఆదేశాలు
- -తుర్క చెరువు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- -పత్తికుంట, మేడికుంట, అంబీర్ చెరువుల పనులు త్వరగా ప్రారంభించాలని సూచన
- -యూడీజీ, సీసీ రోడ్లు, వీధి దీపాల పనులపై ప్రత్యేక సమీక్ష
- -2బీహెచ్‌కే కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం
- -పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమన్న ఎమ్మెల్యే
- -ప్రజలకు మెరుగైన సేవలే అధికారుల ప్రధాన లక్ష్యమని స్పష్టం



కుత్బుల్లాపూర్, జూలై 2 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని బి.ఆర్.ఎస్.ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద అన్నారు. గురువారం ప్రగతి నగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్కిల్ పరిధిలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణ, పరిరక్షణ చర్యలపై ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తుర్క చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే పత్తికుంట, మేడికుంట, అంబీర్ చెరువుల అభివృద్ధి పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. కొత్త వీధి దీపాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న దీపాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే 2బీహెచ్‌కే గృహ సముదాయాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ (ూ×=) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కె.పి. వివేకానంద స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిజాంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ షబ్బీర్ అలీ, డిప్యూటీ తహశీల్దార్ ఉమామహేశ్వర రెడ్డి, ఇరిగేషన్ డీఈ రూప్ లాల్, వీరారెడ్డి, ఏఈ రవి, ఇంజినీరింగ్ శాఖ, జలమండలి శాఖ అధికారులు, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అధ్యక్షుడు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారుల జేబులు నింపుతున్న అక్రమ నిర్మాణాలు

- మౌలాలిలో విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు...
- నిర్మాణదారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మౌలాలి టౌన్ ప్లానింగ్ అధికారులు





మల్కాజిగిరి, జూలై 2,(విజన్ ఆంధ్ర): మౌలాలి డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పెరుగుతుండటం,అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా గ్రీన్ హిల్స్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా సెట్ బ్యాక్ లేకుండా, పర్మిషన్ లేకుండా లేకుండా బహుళ అంతస్థుల భారీ భవన నిర్మాణాలు ఊపందు కున్నాయి. ఈ కట్టడాలు నిర్మాణ దశలో ఉండగా. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ భవన నిర్మాణాల నియంత్రణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ నిర్మాణాల నియంత్రణలో ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడం, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి చర్యలు తీసుకోవడం, ఆక్రమణలను తొలగించడం వంటి బాధ్యతలు టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉన్నప్పటికీ మౌలాలి సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు పనితీరు భిన్నంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక కాలనీలో అనుమతులు లేని నిర్మాణాలు, కమర్షియల్ కాంప్లెక్సు నిర్మితమ వుతున్నా సంబంధిత అధికారులు వాటి గురించి తెలిసి కూడా పట్టించుకోక పోవడంతో వారి పని తీరుపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన సూత్రధారుడు టౌన్ ప్లానింగ్ శ్రీనివాస్ అని ఆయన కనుసల్లోనే అమ్యామ్యాలన్నీ నడుస్తున్నాయని బహిరంగ ఆరోపణలు వినవస్తు న్నాయి. ఇదంతా చూస్తుంటే అసలు మల్కాజ్గిరి జోనల్ ఆఫీస్ లో కమిషనర్ ఉన్నాడా.. లేదా..? అని ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు.. సెక్షన్ ఆఫీసులో పనిచేస్తున్న చైనా మేన్ లు.. వసూల్ రాజాగా మారుతున్నారు.. లక్షల్లో వసూలు చేసుకుంటూ అందరిని మేమే చూసుకుంటామంటూ ఇంటి యజమాని నుండి లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీసుల జారీ చేసి ఆ పేరుతో యజమానులు నుండి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారు. నాక్ ఇంజనీర్ సెక్షన్ లో పని చేస్తున్న కొంతమంది అక్రమ కట్టడాలకు వత్తాసు పలుకుతున్నారని బహిరంగ ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన సందర్భాల్లో కూడా కేవలం నోటీసులు జారీ చేయడం వరకు మాత్రమే పరిమిత మవుతున్నారని, అనంతర చర్యలు లేకపోవడం వల్లనే నిర్మాణదారులు అక్రమ కట్టడాలను పూర్తి చేస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు సక్రమంగా జరుగుతున్నాయా..లేదా.. అనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి. అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి అనుమతి రుసుములు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర పన్నుల రూపంలో రావాల్సి న కోట్ల రూపాయలు దొడ్డిదారిన అధికారులు, సిబ్బంది జేబులలోకి వెళుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిర్మాణదారులు, అధికారుల సహకారంతో నిబంధనలను ధిక్కరించి నిర్మాణాలు చేపడుతున్నా రనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అధికారుల అవినీతి కారణంగా కొంతమందికి అక్రమ నిర్మాణాలు కాసులు పంటగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అడిషన ల్ కమిషనర్ (ప్లానింగ్), చీఫ్ సిటీ ప్లానర్ తదితర ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మౌలాలి సర్కిల్ పరిధిలో నిరాటంకంగా కొనసాగు తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# కామారెడ్డిగూడలో నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశం

- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశం మేరకు
- ఇందిరమ్మ ఇల్లును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన వికారాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిల్లపాటి రాజశేఖర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 02 ( విజన్ ఆంధ్ర ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతన పూర్తి అవుతున్నాయని వికారాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిల్లపాటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని ఆయన సూచించారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోగల కామారెడ్డిగూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ చించెట్టి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు సామల కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిల్లపాటి రాజశేఖర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ నూతన ఇందిరమ్మ గృహప్రవేశానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కచ్చితంగా వస్తాయని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పి.మల్లేశం, గ్రామ సర్పంచ్ చించెట్టి శంకరమ్మ, కరుణాకర్ రెడ్డి, వార్డు మెంబర్ గోవర్ధన్ రెడ్డి, దుర్గయ్య, అత్వెల్లి మాజీ సర్పంచ్ మోహన్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గడ్డపై ఏపీ పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

- జర్నలిస్ట్ కె.వి. ర్ ను వెంటనే విడుదల చేయాలి
- టి జె ఏ సి డిమాండ్,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జులై 2 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): హైదరాబాద్‌లో డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ డి ఎం జే యు, జర్నలిస్ట్ కె.వి.ఆర్, నివాసంలోకి ఏపీ పోలీసులు చొరబడి వ్యవహరించిన తీరు చట్టవిరుద్ధమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ టీ జె ఏ సి,తీవ్రంగా ఖండిస్తోంది. యూనిఫాం, మహిళా పోలీసులు లేకుండా ఇంట్లోకి ప్రవేశించడం, కుటుంబ సభ్యులతో దురుసుగా ప్రవర్తించడం మానవ హక్కుల ఉల్లంఘనే. తెలంగాణ జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేయడం, అర్ధరాత్రి అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా, చట్టబద్ధ ప్రక్రియను పాటించకుండా ఏపీ పోలీసులు వ్యవహరించడం తీవ్ర తీవ్ర ఆందోళన గురిచేస్తుంది,తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర గౌరవాన్ని కాపాడి. జర్నలిస్ట కె.వి. ర్ ను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టి జే ఏ సి,డిమాండ్ చేస్తోంది. అలాగే పత్రికా స్వేచ్ఛను, జర్నలిస్టుల భద్రతను ప్రభుత్వం హామీ ఇవ్వాలి.

# ఎండీ మొయిజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూలై 2 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ మొయిజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని శాలువా తో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మొయిజ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ ముందుకు సాగాలని బండి రమేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి, చైర్మన్ పుష్పా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మయ్య , కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని ఎండీ మొయిజ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ సత్యశారద



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై02(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై విస్తృతంగా చర్చించారు. పోలీసు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరాన్ని ఇరువురు అధికారులు ప్రస్తావించారు. అదేవిధంగా రానున్న పండుగలు, ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ముందస్తు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో సుస్థిర పరిపాలన అందించేందుకు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు పేర్కొన్నారు.

## సన్ ప్యూర్ 30వ వార్షికోత్సవం సందర్భంగా బ్రాండ్ క్యాంపెయిన్



హైదరాబాద్, జూలై 02 (విజన్ ఆంధ్ర) : మసూమ్ గ్రూప్‌కు చెందిన సన్ ప్యూర్ తన 30 ఏళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకుని కొత్త మల్టీమీడియా బ్రాండ్ క్యాంపెయిన్‌ను గురువారం ప్రారంభించినట్లు మసూమ్ గ్రూప్ డైరెక్టర్లు మన్నన్ ఖాన్, ఫరా ఖాన్ గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఈ ప్రచారంలో నటుడు కిచ్చా సుదీప్, జాతీయ అవార్డు గ్రహీత నటి ప్రియమణి ప్రధాన పాత్రల్లో కనిపిస్తున్నారని తెలిపారు. 'సన్ ప్యూర్ ఎలైడ్, సంతోష ఎలైడ్' ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ ప్రచారం కుటుంబ బంధాలు, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. వినియోగదారుల విశ్వాసమే సన్‌ప్యూర్ విజయానికి కారణమని అన్నారు. అలాగే ఆరోగ్యకరమైన వంట కోసం 'సన్ ప్యూర్ ఛాంపియన్ రిఫైన్డ్ కనోలా ఆయిల్'ను కూడా మార్కెట్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. జూలై నుంచి ఈ ప్రచారం టీవీ, థియేటర్లు, డిజిటల్, సోషల్ మీడియా వేదికల్లో ప్రసారం కానుందని తెలిపారు.

# రుణాల లక్ష్యాలు పూర్తి చేయాలి..

**- ఉపాధి, పరిశ్రమలకు బ్యాంకులు చేయూతనివ్వాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, జూలై 2 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలోని అన్ని బ్యాంకులు తమకు కేటాయించిన వార్షిక రుణ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని, వ్యవసాయం, విద్య, గృహ నిర్మాణం, స్వయం ఉపాధి, పరిశ్రమల రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రుణాల పంపిణీ చేపట్టాలని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ చైర్‌పర్సన్ గరిమ అగ్రవాల్ సూచించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశంలో ఆమె అధ్యక్షత వహించారు. సమావేశంలో వ్యవసాయ, గృహ, విద్యా రుణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాలకు రుణాలు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి, శ్రీనిధి పథకాల అమలు, అసంఘటిత కార్మికుల బీమా నమోదు తదితర అంశాలను బ్యాంకుల వారీగా సమీక్షించారు. అనంతరం 2026-27 సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.3,262 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.618 కోట్లు, విద్య, గృహ, ఇతర రంగాలకు రూ.148 కోట్లతో కలిపి మొత్తం రూ.4,029 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్ణయించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయం, విద్య, స్వయం ఉపాధి రుణాల పంపిణీలో 100 శాతం లక్ష్యాలను చేరుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన రుణాలను సకాలంలో మంజూరు చేయాలని ఆదేశించారు. ఆర్‌సేఠీ శిక్షణ కేంద్రంలో కుట్టు, డ్రైవింగ్‌తో పాటు మార్కెట్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణలు అందించి, శిక్షణ పూర్తిచేసిన యువత స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా బ్యాంకులు సహకరించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి రెవెన్యూ గ్రామానికి బ్యాంకింగ్ సేవలు విస్తరించాలని, బ్యాంకింగ్ కరస్పాండెంట్ల సేవలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అసంఘటిత రంగ కార్మికులకు తక్కువ ప్రీమియంతో లభించే పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమా పథకాలలో తప్పనిసరిగా నమోదు చేయించాలని సూచించారు. అలాగే బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి, 1930, 1945 టోల్ ఫ్రీ నంబర్లపై ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఇప్పటికే ఒక యూనిట్ పనిచేస్తుండగా మరో రెండు యూనిట్లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. ఆసక్తి గల పారిశ్రామికవేత్తలు జిల్లా పరిశ్రమల శాఖను సంప్రదించాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, మత్స్యశాఖ తదితర శాఖలు నాబార్డ్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఉపాధి, నైపుణ్యాభివృద్ధి పథకాలను సమర్థంగా వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం మల్లికార్జునరావు, ఆర్బీఐ ఏజీఎం గోరేఖర్, నాబార్డ్ డీడీఎం దిలీప్, లీడ్ బ్యాంక్ రీజినల్ హెడ్ నటరాజ్, ఎస్‌బీఐ ఆర్ఎం పద్మజ, టీజీబీ ఆర్ఎం రాజా నరేంద్ర, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంటలపై విస్తృత అవగాహన

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 02 ( విజన్ ఆంధ్ర ) : ఆయిల్ పామ్ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్దీపక్ తివారి అన్నారు. గురువారము జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయం, ఉద్యానవన శాఖ, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు లభించే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సాగు విధానాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, కొనుగోలు విధానం వంటి అంశాలపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, వారికి సాంకేతిక సలహాలు, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని చెప్పారు. రైతులు ఆయిల్ ఫార్మ్ క్షేత్ర సందర్శన, ఆయిల్ ఫార్మ్ కంపెని సందర్శన చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని, సాగు విస్తీర్ణం పెంచేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ, ఆయిల్ పామ్ సాగులో విజయవంతమైన రైతుల అనుభవాలను ఇతర రైతులకు పరిచయం చేసే కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రిని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్ ,ఉద్యాన వన శాఖ అధికారి సత్తార్, సంబంధిత శాఖల అధికారులు, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్టీలైజర్స్ షాఫ్ లపై ఆకస్మిక తనిఖీలు పలువురు యజమానులపై కేసులు...!

సిద్దిపేట జూలై 2(విజన్ ఆంధ్ర): వర్షకాలం రైతులు చేపడుతున్న వరి సాగుకు యూరియా కొరత వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ అనుసంధానంతో గత సంవత్సరంలో యూరియా యాఫ్ అనే కొత్త ఆన్ లైన్ విధానం ద్వారా ప్రతి రైతుకు సరిపడు యూరియాను అందివ్వాలని అమలు చేసిన యాఫ్ ను కొంతమంది ఫర్టిలైజర్ వ్యాపారులు తప్పు దారిపట్టించ్చి రాష్ట్ర ప్రభుత్వాన్ని అబాష్పలు చేస్తున్నారని రైతుల ఆరోపణలు విలువడుతుండడంతో గురువారం సిద్దిపేట చేర్యాల పట్టణంలోని శ్రీ సాయి శివ ఫర్టిలైజర్ షాఫ్, సిద్దిపేట పట్టణంలోని ఆంజనేయ ఫర్టిలైజర్ షాఫ్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాగా 6420 యూరియా బస్తాలు రైతులకు సరఫరా చేయకుండానే చేసినట్లు చూపించడంతో ఆయా షాప్ ల యజమానులపై పోలీస్ కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

## రావుగారి వెంకట్ రెడ్డికి హార్థిక శుభాకాంక్షలు

- **నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామకం**
- **టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నియామక పత్రం అందజేత**
- **ఎల్లకొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.ప్రకాష్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 02 ( విజన్ ఆంధ్ర ) : అధినాయకత్వం ఆదేశాలను తుచ తప్పకుండా పాటించే వ్యక్తి రావుగారి వెంకట్ రెడ్డి అని ఎల్లకొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.ప్రకాష్ అన్నారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ కార్యకర్తలను సమన్వయపరిచే చాకచక్యం కలవాడని ఆయన స్పష్టం చేశారు. గురువారం నవాబు పేట్ మండల కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధారాసింగ్, చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచన మేరకు టిపిసిసి అధ్యక్షులు ఎంఎల్సి మహేష్ కుమార్ గౌడ్ ఎల్లకొండ గ్రామ మాజి సర్పంచ్ గుడిమల్కాపూర్ మార్కెట్ డైరెక్టర్ రావుగారి వెంకట్ రెడ్డికి నియామక పత్రాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ నవాబుపేట్ మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా మార్చేందుకు అహర్నిశలు కృషి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోలీస్ రాంరెడ్డి, నాగిరెడ్డి, ప్రభాకర్, సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు బల్వంత్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్, రవీందర్ రెడ్డి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు తీరును పరిశీలించిన ఎమ్మెల్యే

మానకొండూర్ జులై. 2. విజన్ ఆంధ్ర : ఇల్లంతకుంట మండలం ముస్కాన్ పేట గ్రామంలో సర్ ఓటరు నమోదు ప్రక్రియను మానకొండూర్ శాసనసభ్యుడు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. గురువారం గ్రామాన్ని సందర్శించినప్పుడు సర్ నమోదు తీరును పరిశీలించడమే కాకుండా ఈ సందర్భంగా ఎదురవుతున్న సమస్యల గురించి ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు వూట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య, ఐరెడ్డి మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# దుందుభి నదిపై వంతెన నిర్మాణం గ్రామాల ఆశలు, ప్రజల ఆకాంక్ష

- 35 కోట్లతో మంజూరైన ప్రాజెక్ట్..
- పిల్లర్ల వరకు పనులు పూర్తి..
- భూ సేకరణ తర్వాత తిరిగి ఊపందుకుంటుందా?



**ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రతినిధి,02 (విజన్ ఆంధ్ర):** ఉమ్మడి పాలమూరు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజల చిరకాల కోరిక దుందుభి నదిపై వంతెన నిర్మాణం. కల్వకుర్తి మండలం రఘుపతి పేట గ్రామానికి చెందిన దుందుభి నది వంతెన నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో 35 కోట్ల రూపాయలతో ఈ వంతెనకు నిధులు మంజూరు కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెంకాయలు కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు.

***ప్రస్తుత పరిస్థితి ఏమిటి?***

ప్రస్తుతం వంతెన నిర్మాణంలో పిల్లర్ల వరకు పనులు పూర్తయ్యాయి. అయితే భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో మిగిలిన పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. భూ సేకరణ పూర్తయిన వెంటనే పనులు పునఃప్రారంభమై త్వరగా పూర్తవుతాయనే ఆశతో చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

***వర్షాకాలంలో తప్పని తిప్పలు:***

వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తుంటారు.ప్రతి ఏడాది ఎవరో ఒకరు వరదలో చిక్కుకొని మృత్యువాత పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

***పాలమూరు బిడ్డగా సీఎం.. ఆశలు రెట్టింపు***

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో, ఈ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణం తప్పకుండా పూర్తవుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానికులకు సీఎం పై బలమైన నమ్మకం ఉంది.

***వంతెన వల్ల కలిగే ఉపయోగాలు***

వంతెన పూర్తయితే పలు గ్రామాల ప్రజలకు తక్షణ ఉపశమనం లభిస్తుంది.

1. లిరాకపోకల సౌలభ్యం: ప్రస్తుతం వర్షాకాలంలో దుందుభి నది ఉప్పొంగడం వల్ల వాహనాలు, పాదచారులు నదిని దాటడం కష్టంగా మారుతోంది. వంతెన అందుబాటులోకి వస్తే ఏ కాలంలోనైనా సురక్షితంగా రాకపోకలు సాగించవచ్చు.
2. దూరం, ఖర్చు తగ్గుతుంది: వంతెన లేకపోవడంతో గమ్యస్థానాలకు వెళ్లేందుకు ప్రజలు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీనివల్ల సమయం, ఇంధన ఖర్చు అదనంగా పడుతోంది. వంతెనతో ఈ భారం తగ్గుతుంది.

***సీఎం పర్యటనపై ప్రజల ఆశ***

ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊర్కొండ మండలంలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా దుందుభి నది వంతెన నిర్మాణ స్థలాన్ని స్వయంగా పరిశీలించి,భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పనులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా స్పందించి వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తారని స్థానికులు ఆశిస్తున్నారు. పాలమూరు ప్రజల కల అయిన ఈ వంతెన త్వరలో వాస్తవ రూపం దాల్చాలని కోరుకుంటున్నారు.

## రోడ్డు సరిగ్గా లేక క్రింద పడి దెబ్బలు తగిలాయ్..



ఆటో కొనుక్కుని 15 సంవత్సరాల నుండి నడుపుతూ జీవనం సాగిస్తూ ఉన్నాను. ఈ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో వాగు వస్తే చాలా ఇబ్బందులు పాలైతుంది,ఒకవేళ పాకర వచ్చేసి ఆ బండ్లు కింద పడటం,మీద పడడం దెబ్బలు తగలడం,కాళ్ళు చేతులు విరగడం చాలా ఇబ్బంది కరంగా ఉంది. ప్రాజెక్టు, రోడ్డు తొందరగా చేస్తే బాగుంటది.

**- నిరంజన్,ఆటో డ్రైవర్...**

## బస్ రెండు సార్లు నీళ్లలో పడి పోయింది..



వర్షాకాలంలో నీటితో మొత్తం నిండి పోయి ఉంటుంది. బస్ లు పోవాలన్న,బైకులు పోవాలన్న భయంతో పోవాల్సి వస్తుంది. బైక్ లపై లేడీస్ ఉంటారు, వేరే గ్రామాలకు వెళ్ళడానికి ఈ ఒక్క రూట్ తప్ప వేరే లేదు. బైకులు గుంతలలో పడి లేడీస్ చాలా సార్లు కింద పడ్డారు. చాలా వరదలలో బైకులు కొట్టుకుపోయాయి. ఒక సంవత్సరం క్రితం క్యాంపు పెట్టి పనులు ప్రారంభం చేశారు. వర్కు బాగా స్పీడ్ గా చేసి వరద వల్ల ఆపేశారు. మళ్లీ పని స్టార్ట్ చేయలేదు ఎందుకో ఏమో తెలీదు. బ్రిడ్జి పడితే రవాణా సౌకర్యం బాగుంటది..

**- శ్రీను పోతిరెడ్డిపల్లి..**

## నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూల్ బస్సులు సీజ్

**- ఎంవీఐ వంశీధర్**



రాజన్న సిరిసిల్ల, జూలై 2 (విజన్ ఆంధ్ర బ్యూరో): పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు రవాణా శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వంశీధర్ హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వద్ద వివిధ విద్యాసంస్థలకు చెందిన స్కూల్ బస్సులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుండా నడుస్తున్న రెండు స్కూల్ బస్సులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ఎంవీఐ తెలిపారు. తనిఖీల అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా జిల్లాలో స్కూల్ బస్సులపై నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని చెప్పారు. ప్రతి బస్సులో అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స కిట్, తాగునీటి సదుపాయం, అత్యవసర నిష్క్రమణ ద్వారం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే డ్రైవర్‌తో పాటు అటెండర్ కూడా విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో బస్సుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని యాజమాన్యాలకు సూచించారు. ముఖ్యంగా విండ్‌షీల్డ్ వైపర్లు, రివర్స్ హారన్, హెడ్‌లైట్లు తదితర భద్రతా పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలన్నారు. సాంకేతిక లోపాలు ఉన్న లేదా భద్రతా ప్రమాణాలు పాటించని బస్సులను రోడ్డుపైకి తీసుకురావద్దని, అలాంటి వాహనాలు గుర్తిస్తే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, అన్ని అనుమతులు, పత్రాలు, భద్రతా ప్రమాణాలను విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తాయి

**- తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్.**



కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జులై 02: బోరబండలో శివాజి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కినాపురం లక్ష్మణ్ గౌడ్ ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ నూతన దేవాలయ యంత్ర విగ్రహ సింహ వాహన శిఖర ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిధులుగా హాజరై స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. దర్శనానంతరం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, వేద పండితులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ ని డా. సత్యం శ్రీరంగం ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈరోజు నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి శాంతి, సత్సంకల్పాలు కలిగిస్తాయని, ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి దీవెనలు, కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధి వర్షాలతో పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగింది. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. హైదరాబాద్ లో నెల రోజుల పాటు జరిగే ఆషాఢ బోనాల ఉత్సవాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ ల అధ్యక్షులు మొయినుద్దీన్, కృష్ణ రాజ్ పుత్, విఠల్ రెడ్డి, నరసింహా యాదవ్, కనకయ్య, లక్ష్మీనారాయణ, సుంకన్న, మస్తాన్ రెడ్డి, భారతమ్మ, కలికోట శంకర్, రాజేష్ గౌడ్, పల్లపు వేణు, చోట మొయిజ్, అహ్మద్ వాజీద్ పాషా, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ..

**- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం తప్పనిసరి..**



కొత్తగూడెం బ్యూరో జూలై 03(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగుల సంక్షేమంపై సమగ్రంగా పరిశీలించి, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలో భాగంగా ఆస్పత్రిలోని వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, వారి విధుల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. సిబ్బంది ఎన్ని షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసూతి వార్డు, జనరల్ వార్డు తదితర విభాగాలను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది స్పందన, ఇతర సౌకర్యాలపై రోగుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు షిఫ్టుల్లో వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడం ప్రతి వైద్యుడు, ఉద్యోగి బాధ్యత అని అన్నారు. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించే అధికారులు, ఉద్యోగులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం. రాధామోహన్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ సీతారాం, ఆర్ఎంఓ చైతన్య, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుల నియామకం



బోడుప్పల్, జూలై 2 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): బోడుప్పల్ సర్కిల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా డివిజన్ అధ్యక్షులను నియమించారు. నూతనంగా 9వ డివిజన్ (మేడిపల్లి) అధ్యక్షుడిగా తుంగతుర్తి రవి, 10వ డివిజన్ (పీర్జాదిగూడ) అధ్యక్షుడిగా బండి శ్రీరాములు,11వ డివిజన్ (బోడుప్పల్) అధ్యక్షుడిగా బొమ్మక్ కళ్యాణ్ కుమార్, 12వ డివిజన్ (చెంగిచెర్ల) అధ్యక్షుడిగా పోగుల దిలీప్ రెడ్డిలను నియమించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మాట్లాడుతూ పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రతి కార్యకర్తను సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని వారు పేర్కొన్నారు.

## ఓటర్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



బోడుప్పల్,జూలై 02(విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో కొనసాగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి క్షేత్రస్థాయిలో అధికారులతో పాటు బూత్ స్థాయి కార్యకర్తలతో పరిశీలిస్తూ బిఎల్ఓలు,బిఎల్ఏ లతో మాట్లాడి పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి లోపాలకు తావులేకుండా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు, బూత్ స్థాయి సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, మైనార్టీ అధ్యక్షుడు జిలాని పాషా, నాయకులు ఆకుల మధుకర్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, వీరమళ్ళ జగన్నాధం, నర్సిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శంకర్ గౌడ్, చిందం రమేష్, శ్యామల రమేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అదనపుకలెక్టర్,తో ఐఆర్సిఎస్ సభ్యత్వం పొందిన జంతు ప్రేమికురాలు.



నారాయణపేట, జూలై 2( విజన్ ఆంధ్ర) : గత 15 సంవత్సరాలుగా నారాయణపేట జిల్లా కేంద్రంలో తల్లి పిన్నమ్మలతో కలిసి గోవులు కుక్కలు ఇతర జంతువుల యోగక్షేమాల కోసం నిరంతరం కృషి చేస్తున్న కుమారి స్వప్న భీమయ్య గురువారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీను చేతుల మీదుగాఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్షిప్ ను తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని నారాయణపేట జిల్లాలో బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కుమారి స్వప్న మాదిరిగా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తమ సభ్యత్వాన్ని ఐఆర్సిఎస్ లో పొంది ఇతరులను సభ్యులుగా చేర్పించి ఐఆర్సిఎస్ సభ్యత్వ కార్యక్రమం (స్పెషల్ మెంబర్షిప్ డ్రైవ్) ను విజయవంతం చేయాలన్నారు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులకు పాటు ప్రభుత్వ ఉద్యోగులందరూ కూడా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం లైఫ్ మెంబర్షిప్ తీసుకొని రక్తదాతలను ప్రోత్సహించే విధంగా ఐఆర్సిఎస్ ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం న్యాయవాది రఘువీర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల విద్యారంగం లో పలు సమస్యలను పరిష్కరించాలి

**- మంద నాగక్రిష్ణ ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు.**

**- పాఠశాలల , హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి.**

**- నూతన మండల కన్వీనింగ్ కమిటీ ఎన్నిక.**



జూలూరుపాడు జులై 3 విజన్ ఆంధ్ర జూలూరుపాడు మండల కేంద్రం లో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ ఎఫ్ ఐ జూలూరుపాడు మండల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సీ పి ఎం పార్టీ మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు మంద నాగక్రిష్ణ పాల్గొని మాట్లాడుతూ మండలంలోని పాఠశాల లో , హాస్టళ్లు దయనీయ స్థితిలో ఉన్నాయని కనీసం మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మందా నాగకృష్ణ అన్నారు. పాఠశాలలలో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సకాలంలో విద్యార్థులకు అందజేయడంలో రాష్ట్ర విద్యాశాఖ తీవ్ర వైఫల్యం చెందిందని విమర్శించారు. అలాగే విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు లేక ఒక్కొక్క ఉపాధ్యాయుడు రెండు మూడు సబ్జెక్టులు బోధించే పరిస్థితి ఉంది. కాబట్టి తక్షణమే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని , మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలి వాటికి డోర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు . ఈ నూతన మండల కన్వీనింగ్ కమిటీ ఎన్నుకోవడం చాలా ఆనంద కరంగా వుంది అన్నారు . మండల నూతన కన్వీనర్ గా తరుణ్ ఎన్నిక అయ్యారు. ఈ సమావేశంలో మండల నాయకులు పృథ్వి , పవన్ కుమార్ , శ్రీను , విష్ణు , చరణ్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకే జిల్లా మహాసభ

**-భారీ ఎత్తున నిర్వహణకు కమిటీల ఏర్పాటు**



సంగారెడ్డి బ్యూరో, జూలై :2(విజన్ ఆంధ్ర ) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను ఈనెల 9వ తేదీన భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి , జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. మహాసభ ఏర్పాట్లకు సంబంధించి గురువారం సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా పైసల్ మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నామని అన్నారు. చాలామంది అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇంకా రాలేదని, హెల్త్ కార్డు సమస్య ఇంకా పెండింగ్ లోనే ఉందని చెప్పారు. అదే సమయంలో ఉద్యోగ భద్రత కూడా లేకుండా పోయిందని అన్నారు. వీటన్నిటిపై చర్చించడానికి గాను 9వ తేదీన సంగారెడ్డిలో మహాసభ జరుపుతున్నామని వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పాత్రికేయులకు పదివేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నామని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లాలోని పాత్రికేయుల సమస్యల పరిష్కారమే తమ యూనియన్ లక్ష్యం అని వెల్లడించారు. అంతేకాకుండా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న మధ్య తరహా పత్రికలు, ఉర్దూ పత్రికలు,కేబుల్ టీవీ, ఫోటోగ్రాఫర్లు ,వీడియో గ్రాఫర్లు దశాబ్దాలుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. వారందరికీ ఈ మహాసభ ద్వారా భరోసా కల్పించనున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలం, హెల్త్ కార్డు, అక్రిడేషన్ కార్డులను సాధించడం జరుగుతుందన్నారు. మహాసభ నిర్వహణకు ఆహ్వాన కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, వేదిక అలంకరణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణతో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇతర ముఖ్యులు మహాసభకు హాజరవుతున్నందున అన్ని మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రాల నుంచి పెద్ద ఎత్తున పాత్రికేయులు తరలి కావాలని కోరారు. ఈ మేరకు ఆయా ప్రాంతాలలో సమన్వయం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రంలో నేడు తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్న సంఘం తనదేనని అన్నారు. అన్ని విభాగాల జర్నలిస్టుల ఐక్యతకు పాటుపడుతూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్ ను విడుదల చేశారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అనిల్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధిక్, జిల్లా కోశాధికారి మసూద్, ఇతర ముఖ్యులు సిద్దన్న పాటిల్, శ్రీనాథ్ ,బసవరాజ్ , హాజీ, వెంకటరెడ్డి, బాసిత్ ,అన్వర్, మతీన్, విల్సన్, ఈశ్వర్ చవాన్, లక్ష్మణ్,కిషోర్,సంగమేశ్వర్ , ప్రభాకర్, అంజయ్య, రమేష్ గౌడ్ ,వెంకటేష్, రవీందర్, సత్తార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# సంఘటిత పోరాటంతోనే ఆటో కార్మికుల సమస్యలకు పరిష్కారం

**- కంచర్ల జమలయ్య**

**- ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ మహాసభ ఘనంగా.. 150 మంది డ్రైవర్ల భారీ చేరిక**

**- ఇంధన ధరల నియంత్రణ, సామాజిక భద్రత కల్పించాలి..**

**- ఆటో కార్మికుల సంక్షేమమే లక్ష్యం.. యూనియన్ బలోపేతానికి పలు తీర్మానాలు**

**- కొత్తగూడెంలో ఆటో వర్కర్స్ యూనియన్ 15వ పట్టణ మహాసభ విజయవంతం**







కొత్తగూడెం బ్యూరో, జూలై 03 (విజన్ ఆంధ్ర) : సంఘటిత పోరాటంతోనే ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, కొత్తగూడెం పట్టణ సీపీఐ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. గురువారం శేషగిరి భవన్‌లో యూనియన్ అధ్యక్షుడు అబ్బులు అధ్యక్షతన నిర్వహించిన ఆటో వర్కర్స్ యూనియన్ 15వ పట్టణ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ, ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉపాధి భద్రత కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఉద్యమిస్తామని హామీ ఇచ్చారు. పెరుగుతున్న ఇంధన ధరలను నియంత్రించాలని, జీవన వ్యయానికి అనుగుణంగా ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సామాజిక భద్రత, ప్రమాద బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ బలోపేతం, సభ్యత్వ నమోదు విస్తరణ, కార్మికుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యాచరణపై పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.

150 మంది ఆటో డ్రైవర్ల భారీ చేరిక

ఈ మహాసభలో వివిధ ఆటో అడ్డాల నుంచి 150 మంది ఆటో డ్రైవర్లు ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్‌లో చేరారు. వారికి కంచర్ల జమలయ్య పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నూతన సభ్యులు మాట్లాడుతూ, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫయామ్, మర్రి కృష్ణ, ఆరెల్లి కృష్ణ, అబ్బులు, విజ్జి, బాబు జానీ దేశి, బోట్టు శ్రీను, మంద శ్రీను, జలీల్, గౌస్, చింటు తదితరులు పాల్గొన్నారు.

# బొల్లిగూడంలో భూపోరాటం ఉద్రిక్తం

**- కల్వకుంట్ల కవిత అరెస్ట్.. బొల్లారం పీఎస్‌కు తరలింపు**

**- టెంట్లు తొలగించిన పోలీసులు..కార్యకర్తల ఆందోళన**

**- దళితుల నుంచి భూపోరాటానికి వ్యతిరేక నిరసన**



బోడుప్పల్, జూలై 2 (విజన్ ఆంధ్ర): మేడ్చల్మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడంలో గురువారం తెలంగాణ రక్షణ సేన చేపట్టిన భూపోరాటం ఉద్రిక్తతకు దారితీసింది. ఉప్పల్ బాగాయత్‌లో నిర్వహించాలనుకున్న భూపోరాట సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో పాటు పలువురు నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీంతో సభా వేదికను బొల్లిగూడానికి మార్చగా, అక్కడ కూడా సభ నిర్వహణకు అనుమతి నిరాకరించారు. భూపోరాట సభ కోసం ఏర్పాటు చేసిన టెంట్లను పోలీసులు తొలగించడంతో తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. భూపోరాటంలో పాల్గొనేందుకు బొల్లిగూడానికి వచ్చిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పోలీసులు అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కవిత అరెస్టును నిరసిస్తూ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టడంతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇదిలా ఉండగా, బొల్లిగూడం ప్రాంతంలోని దళితుల భూములను ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ విధానంలో స్వాధీనం చేసుకుని ఎకరానికి 600 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందని స్థానిక దళితులు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన చేపట్టిన భూపోరాటాన్ని వారు వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. భూపోరాటం సందర్భంగా అదుపులోకి తీసుకున్న తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలను ఘట్‌కేసర్‌తో పాటు పలు పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. దీనికి నిరసనగా తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టి, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బొల్లిగూడం ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తుండగా, పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసుల మెరుపు దాడి 8 మంది అరెస్ట్



భూపాలపల్లి జిల్లా : 2 జూలై ( విజన్ ఆంధ్ర ) : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ కార్యకలాపాల నిర్మూలన కోసం చేపడుతున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు గురువారం భూపాలపల్లి జిల్లా గణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.10,500 నగదుతో పాటు 7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం గణపురం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. జిల్లాలో పేకాట, జూదం తదితర అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో పేకాట లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పదవీ విరమణ పొందిన మహమ్మద్ సాదిక్ కు హార్దిక శుభాకాంక్షలు

**- 32 సంవత్సరాల పదవీ కాలంలో అవిశ్రాంత సేవలు**

**- అందరి హృదయాలను చూరగొన్న సహృదయుడు**

**- ప్రభుత్వ విధులను ఏనాడు నిర్లక్ష్యం చేయలేదు**

**- పండుగలు వచ్చినా విధులకు హాజరయ్యే వ్యక్తి**

**- మహమ్మద్ సాదిక్ కుమారుడు మహమ్మద్ రిజ్వాన్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 02 ( విజన్ ఆంధ్ర ) : 32 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ జీవితంలో ఏ మచ్చా లేకుండా, పదిమందికి ఉపయోగపడి, మా కుటుంబాన్ని మరో మెట్టుకు పెంచుకోగలిగాడు మానాన్న మహమ్మద్ సాదిక్ అని అతని కుమారుడు మహమ్మద్ రిజ్వాన్ అన్నారు. ప్రభుత్వం మానాన్న మీద పెట్టుకున్న నమ్మకాన్ని ఏనాడు వమ్ము చేయలేదని ఆయన స్పష్టం చేశారు. గురువారం వికారాబాద్ పట్టణ పరిధిలోని అంబేద్కర్ భవన్ లో మహమ్మద్ సాదిక్ పదవీ విరమణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతని కుమారుడు మహమ్మద్ రిజ్వాన్ మాట్లాడుతూ మానాన్న మోమిన్ పేట్ లో మొట్టమొదటి సారిగా ప్రభుత్వ అపాయింట్మెంట్ పొంది సేవలు అందించారు. మోమిన్ పేట్ లోనే 12 సంవత్సరాలు, పట్లూరులో 6 సంవత్సరాలు, హయత్ నగర్ లో 6 సంవత్సరాలు, నవాబ్ పేట్ లో 8 సంవత్సరాలు విధులు నిర్వహించి నేడు పదవీ విరమణ పొందారు. మానాన్న శేష జీవితం అంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో హాయిగా గడపాలని కోరుకున్నారు. ప్రతిరోజు హడావిడిగా ప్రభుత్వ విధులకు సమయానికి హాజరయ్యే వ్యక్తికి పదవీ విరమణ పొందడం కొంత బాధ కలిగించే విషయమే. కానీ, ప్రస్తుతం ఆ హడావిడి చేయాల్సిన అవసరం ఉండదు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.